నీటి సంఘాల ఓటర్లు నమోదకు ప్రత్యేక డ్రైవ్

వీఆర్‌వోలతో సమావేశంలో తహశీల్దార్ కృష్ణలత వెల్లడి

విశాలాంధ్ర-జామి: త్వరలో జరగనున్న నీటి సంఘాల ఎన్నికలకు సంభందించి ఓటర్లు నమోదకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని తహశీల్దార్ ఐ.కృష్ణలత సూచించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో విఆర్‌వోలతో సమావేశం నిర్వహించారు. ఈసమావేశానికి ఇరిగేషన్ ఎఇ సంతోష్ హాజరై పలు విషయాలను వివరించారు. అనంతరం తహశీల్దార్ మాట్లాడుతూ శనివారం, ఆదివారం రెండు రోజులపాటు గ్రామాలలో డ్రైవ్ నిర్వహించి ఓటర్లు నమోదును చేపట్టాలని సూచించారు. ప్రతీ ఒక్కరు ఈస్పెషల్ డ్రైవ్‌పై దృష్టి సారించాలని తెలిపారు. ఈసమావేశంలో డిప్యూటీ తహశీల్దార్ సత్యనారాయణమూర్తి, రీసర్వే డిటి అర్జున్, ఆర్ఐ సృజన తదితరులు పాల్గొన్నారు.

రహదారుల మరమ్మతు పనులను ప్రారంభించాలి

కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్

విశాలాంధ్ర-విజయనగరం: గుంతలు లేని రహదారుల నిర్మాణంలో భాగంగా జిల్లాలో చేపడుతున్న 68 రహదారి మరమ్మతుల పనులన్నిటినీ సోమవారం లోగా ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబెద్కర్ ఆదేశించారు. జిల్లాలో 932 కిలో మీటర్ల రహదారి మరమ్మత్తుల పనులను జనవరి నాటికి పూర్తి చేయవలసి ఉన్నందున వెంటనే పనులను ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. శుక్రవారం ఆర్ అండ్ బి అధికారులతో రహదారి మరమ్మతుల పనులపై ఆయన ఛాంబర్ లో సమీక్షించారు. నియోజకవర్గం వారీగా మంజూరైన పనులను, ప్రారంభం అయిన పనుల పై ఆరా తీశారు. 68 పనులకు గానూ 3 పనులే ప్రారంభం అయ్యాయని ఎస్.ఈ కాంతిమతి తెలిపారు. సోమవారం నుండి ప్రతిరోజూ సమీక్షిస్తానని, ప్రతి రోజు పర్యటించి పనుల పురోగతిని స్వయంగా పరిశీలిస్తామని, అంతే కాక పనుల నాణ్యత పై కూడా తనిఖీ చేస్తానని కలెక్టర్ తెలిపారు. ప్రతి రోజూ పనులు జరగాలని, సోమవారం నాడు అన్ని పనులను ప్రారంభించి ఆ రోజు సమీక్ష కు ప్రారంభమైన పనుల ఫోటోలు కూడా తీసుకుని హాజరవ్వాలని సూచించారు. సమావేశంలో ఆర్ అండ్ బిఈఈ, డి.ఈ లు పాల్గొన్నారు.

సంపూర్ణ పారిశుధ్య సాధనే లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణ

అధికారులతో కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్

విశాలాంధ్ర-విజయనగరం: పారిశుద్ధ్య లోపం కారణంగా ప్రబలే అతిసారం, మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధుల వ్యాప్తికి అడ్డుకట్ట వేసి జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పరిస్థితులను నెలకొల్పడం ద్వారా సంపూర్ణ పారిశుద్ధ్య జిల్లాగా రూపొందించే లక్ష్యంతో జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ ఒక సమగ్ర కార్యాచరణకు నడుం బిగించారు. దీనిలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యం క్షీణించ దానికి గల కారణాలు గుర్తించి వాటిని సరిదిద్దేందుకు అవసరమైన చర్యలను వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో చేపట్టడమే ఈ సమగ్ర కార్యాచరణలోని ముఖ్యాంశం. దీనిలో భాగంగా జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో ప్రస్తుత పరిస్థితిని అంచనా వేసేందుకు శనివారం నుంచే యీ కార్యాచరణకు శ్రీకారం చుడుతున్నట్టు కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ వెల్లడించారు. ప్రత్యేక కార్యాచరణపై శుక్రవారం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, వైద్య ఆరోగ్య, ప్రణాళిక శాఖల అధికారులతో తన కార్యాలయంలో సమావేశమై కలెక్టర్ చర్చించారు. ముఖ్యంగా గ్రామాల్లో బహిరంగ మల విసర్జన, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం, వాటి విని యోగం తదితర అంశాల ఆధారంగా సర్వే వుంటుందన్నారు. డ్రైయిన్ల మధ్యలో వున్న తాగునీటి పైపులైన్లను మార్పుచేసి వాటికి దూరంగా వేయడం వంటి కార్యక్రమాలను చేపట్టనున్నట్టు కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పరిస్థితులపై అంచనా వేసేందుకు శనివారం నుంచి ఒక సర్వే నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి, ఆరోగ్య కార్యకర్త, గ్రామ సంఘం అధ్యక్షురాలు, కార్యదర్శి, ఇంజనీరింగ్ సహాయకుల ఆధ్వర్యంలో నవంబరు 9 నుంచి 13వ తేదీ వరకు ఇంటింటికీ వెళ్లి పలు అంశాలపై సమాచారం సేకరించాలన్నారు. సమావేశంలో డి.ఆర్.డి.ఎ. ప్రాజెక్టు డైరక్టర్ కళ్యాణ చక్రవర్తి, డిపిఓ వెంకటేశ్వరరావు, గ్రామీణనీటిసరఫరా ఎస్.ఇ. ఉమాశంకర్, సిపిఓ పి.బాలాజీ, పంచాయతీరాజ్ ఎస్.ఇ. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి సంఘ ఎన్నికలకు శిక్షణ

విశాలాంధ్ర-గజపతినగరం : గజపతినగరం తాసిల్దార్ కార్యాలయంలో శుక్రవారం సాగునీటి సంఘాల ఎన్నికలపై నీటిపారుదల శాఖ జేఈ సురేష్, తాసిల్దార్ రత్న కుమార్ లు శిక్షణ ఇచ్చారు. ఎన్నికలకు సంబంధించి విధుల్లో అలసత్వం లేకుండా పగడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ఎన్నికల్లో రాజకీయ పార్టీలకు అతీతంగా పారదర్శకంగా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు పీవోలు. ఏపీవోలు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు తొలగింపు

నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య

విశాలాంధ్ర-విజయనగరం అర్బన్ : పూల్ బాగ్ ప్రాంతంలో కాలువలు, రహదారులను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పి. నల్లనయ్య ఆదేశాలతో సిబ్బంది శనివారం తొలగించి వేశారు. అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయ సమీపంలో ఉన్న ఓ భవనం కాలువను ఆక్రమించి ప్రహరీ గోడ నిర్మాణాన్ని చేపట్టారు. అలాగే కాలువను కప్పివేసి బహుళ అంతస్థును మరొకరు నిర్మించారు. వీటిని డివిజన్ పర్యటనలో భాగంగా ఈరోజు గుర్తించిన కమిషనర్ పి. నల్లనయ్య ప్రణాళిక సిబ్బందిని పిలిచి వెంటనే వాటిని తొలగించాలని ఆదేశించారు. దీంతో టిపిఎస్ అనిత నేతృత్వంలో బృందం తక్షణమే అక్కడకు వెళ్లి ఆయా అక్రమ నిర్మాణాలను తొలగించి వేశారు. విజయనగరం నగరపాలక సంస్థ పరిధిలో అనుమతులు లేని అక్రమ నిర్మాణాలను సహించబోమని కమిషనర్ పి. నల్లనయ్య ఈ సందర్భంగా తెలిపారు.

వేతన బకాయిలు చెల్లించండి

విశాలాంధ్ర-గుర్ల: మూడు నెలలుగా వేతనాలు అందుక పోవడంతో కుటుంబ పోసన భారంగా మారిందని 104 వైద్య సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. తమ బకాయి వేతనాలు చెల్లించాలని సమస్యలను పరిష్క రించాలని కోరుతూ తాసిల్దార్ ఆదిలక్ష్మి, ఎంపీడీవో శేషుబాబు, వైద్యాధికారి డాక్టర్ చెన్నయ్ కు శుక్రవారం వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 104 సేవలను ప్రభుత్వమే ప్రాథమిక ఆరోగ్యంద్రాల ద్వారా నిర్వహించాలని. 2020 తర్వాత విధుల్లో చేరిన 104 వాహన డ్రైవర్లకు, డీఈవోలకు జీవో 7 దూర వేతనాలు ఇవ్వాలని, భీమా సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు.

విజినిగిరిలో యువకుడు దారుణహత్య..?

- స్నేహితుడే కాలయముడిగా మారిన వైనం!
- పోలీసుల అదుపులో నిందితుడు

మృతుని ఫైల్‌ఫోటో

విశాలాంధ్ర-జామి: ప్రశాంతతకు మారుపేరుగా ఉన్న మండలంలోని విజినిగిరిలో ఓ యువకుడు అనుమానస్పద స్థితిలో మరణించాడు. అయితే ఇది ముమ్మాటికీ హత్యగా భావిస్తున్నట్లు మృతుని సోదరి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు పోలీసులు హత్య కేసుగా నమోదు చేసుకున్నారు. ఈకేసుకు సంభందించి పోలీసులు తెలిపిన కథనం మేరకు గ్రామానికి చెందిన గనివాడ అచ్చంనాయుడు(33) చిన్న చిన్న ఎలక్ట్రీషియన్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొద్ది నెలలక్రితం హైదరాబాద్‌కు పనులు నిమిత్తం వెళ్ళిపోయాడు. గురువారం తిరిగి వచ్చి జామిలోని ఉన్న అతని అక్క శిరపురపు కొండమ్మవద్దకు వచ్చి వంద రూపాయలు కావాలని తీసుకుని వెళ్ళిపోయాడు. అనంతరం అదే రోజు రాత్రి అదే గ్రామానికి చెందిన ఓయువకునితో కలిసి అధికంగా మద్యంను అచ్చంనాయుడు సేవించినట్లుగా తెలిసింది. శుక్రవారం ఉదయం నీ తమ్ముడు గ్రామంలోని చాకిరేవు వద్ద మరణించి వున్నాడని బందువులు కొండమ్మకు సమాచారం అందించారు. దీంతో ఆమె హుటాహుటీన అక్కడకు వెళ్ళి చూడగా మరణించిన అచ్చంనాయుడు శరీరంపై ఉన్న గాయాలను చూసి హత్యగా కొండమ్మ అనుమానించింది. దీంతో పోలీసులకు తన తమ్ముడుని హత్య చేసారంటూ ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు అచ్చంనాయుడుది హత్య కేసుగా ఎస్ఐ వీరజనార్ధన్ నమోదు చేసారు.

మృతదేహం వద్ద లభ్యమైన ఆదారాలు..!

సిఐ రవికుమార్ ఆధ్వర్యంలో పోలీసులు మృతదేహం వద్ద పలు ఆధారాలనిమిత్తం పరిశీలన జరిపారు. క్లూస్‌టీంతో పాటు, డాగ్ స్క్వాడ్‌ను రప్పించి ఆధారాలనిమిత్తం తనిఖీలు చేపట్టారు. ఈసమయంలో కీలకమైన ఆధారాలు లభ్యమైనట్లుగా తెలిసింది. శవపంచనామా అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఎస్‌కోట సిహెచ్‌సికి తరలించారు. ఈకేసులో అనుమానితునిగా ఉన్న ఓ యువకున్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల విచారణ సమయంలో గ్రామంలోని అందరూ కనీస సమాచారం తెలియజేయకపోవడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది.

జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు అక్కా చెల్లెలు ఎంపిక

విశాలాంధ్ర-దత్తిరాజేరు: :విజయనగరం జిల్లా డెంకాడ మండలంలోని అక్కివరం గ్రామానికి చెందిన అట్టాడ ధనుశ్రీ, అట్టాడ దీక్ష శ్రీ ఇద్దరు అక్క చెల్లెలు తైక్వాండోలో ఉత్తమ ప్రతిభను కనబరుస్తున్నారు. గత నెల 4,5 తేదీలలో ఆంధ్రప్రదేశ్ 68వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్ 19 పోటీలు రైల్వే కోడూరు మండలం కడప జిల్లా లో జరిగాయి అక్కడ ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు అక్క అట్టాడ ధనుశ్రీ ఎంపికైంది. డిసెంబర్ 18 నుండి 25 వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రంలో జరగనున్న జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు ఆమె వెళ్లనున్నారు. అలాగే చెల్లి అట్టాడ దీక్షశ్రీ కూడా అక్క బాటలో నడుస్తూ ఉత్తమ ప్రతిభను కనబరుస్తున్నారు. గత నెల 6, 7 తేదీలలో తిరుపతిలో జరిగిన 68వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈనెల 8 నుండి 12 వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రం లోని విదీశ జిల్లాలో జరుగునున్న జాతీయ స్థాయి పోటీలలో పాల్గొంటారు. అక్క చెల్లెలకు పలువురు ముఖ్య నాయకులు, పెద్దలు, అభినందనలు తెలిపారు . అలాగే జాతీయ స్థాయిలో కూడా ఉత్తమ ప్రతిభను కనబరచాలని కోరారు.

పోలీసుల అదుపులో కలెక్టరేట్

విశాలాంధ్ర-విజయనగరం: జిల్లా పాలనాకేంద్రమైన కలెక్టరేట్

ఎమ్మెల్సీ ఎన్నికల పుణ్యామని పోలీసుల అదుపులోకి వెళ్ళిపోయింది. ఎన్నికల నేపధ్యంలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని చెబుతూ కలెక్టరేట్ ప్రధాన ద్వారాల వద్ద భారీ ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేసారు. ఉద్యోగులను, ముఖ్యఅవసరాలు కలిగిన వ్యక్తులను మాత్రమే విచారించి లోపలికి పంపించారు. మద్యాహ్నాం 3గంటల వరకు ఎవరినీ లోపలకి పంపించలేమని పోలీసులు చెబుతున్నారు. మీడియాను సైతం లోపలికి రానివ్వలేదు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంభందించి నామినేషన్ వేసే వ్యక్తులను లోపలికి వదిలిపెట్టారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి

విశాలాంధ్ర విజయనగరం పోర్ట్ : పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్ డిమాండ్ చేశారు. శుక్రవారం విజయనగరం జిల్లా కేంద్రంలోని జిల్లా కోర్టు ఎదురుగా ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు వైయస్ షర్మిల రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు పెంచిన కరెంటు బిల్లులను తగ్గిస్తామని హామీ ఇచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు కావస్తున్న ఇంతవరకు విద్యుత్ చార్జీలు తగ్గించలేదు అని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, గంటా సతీష్, గేదెల తిరుపతి, రామచంద్ర రాజు, దుర్గాప్రసాద్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూడి శ్రీను, సీనియర్ నాయకులు సుంకరి సతీష్, బంగారు నాయుడు, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

రాజం రోడ్డులో గోతులు పూడ్చిన సీఐ నారాయణరావు

విశాలాంధ్ర-రామభద్రపురం: మండల కేంద్రంలో రాజం కు వెళ్లే రహదారిలో చర్చికి సమీపంలో బొబ్బిలి సర్కిల్ ఇన్స్పెక్టర్ నారాయణరావు శుక్రవారం గోతులను పూడ్చారు.. గతంలో కురిసిన వర్షాలకు జాతి రహదారిపై గోతులు ఏర్పడ్డాయి. ద్విచక్ర వాహనదారులు గోతుల్లో పడి గాయాలు పాలవడంతో సిఐ స్పందించి శ్రీనివాస కన్స్ట్రక్షన్ కంపెనీ కి చెందిన బొబ్బది శేఖరు రెండు లారీలలో 6 యూనిట్లు సిమెంట్ ఇసుక కలిపిన మెటల్ ఇవ్వడంతో గోతులను పూడ్చారు.. సిఐ గోతుల పోల్చడం తొ పలు వాహనదారులు ఆయనకు అభినందనలు తెలిపారు. ప్రమాదాలు జరగకుండా నియంత్రించడమే పోలీసులు కర్తవ్యం అని సిఐ అన్నారు.

సాగునీటి సంఘాలు ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలి

జిల్లా నీటిపారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమణ

విశాలాంధ్ర-వేపాడ : ఈనెల 21న రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న సాగునీటి సంఘాల ఎన్నికలను అధికారులు పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా నీటిపారుదల శాఖ ఈ.ఈ ఎం.వి.రమణ అన్నారు. మండల కేంద్రమైన వేపాడ మండల పరిషత్ సమావేశ భవనంలో అధికారులకు శుక్రవారం నిర్వహించిన ఎన్నికల శిక్షణా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 26 నీటి సంఘాలకు ఈనెల 21న ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఎన్నికల నిర్వహణ బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రస్తుతం ఓటర్ల జాబితా తయారీలో అధికారులు నిమగ్నమై ఉన్నారని తెలిపారు. ఎన్నికల నిర్వహణ బాధ్యత చేపట్టే అధికారులు పారదర్శకంగానూ నిష్పక్షపాతంగా వ్యవహరించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ డిప్యూటీ ఇంజనీర్ శ్రీ చరణ్, ఏ.ఈ హేమంత్ కుమార్, తహసిల్దార్ జి.రాములమ్మ ఎంపీడీఓ సి.హెచ్. సూర్యనారాయణ, పలువురు మండల స్థాయి అధికారులు ఉపాధ్యాయ సిబ్బంది, సచివాలయ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో సిబ్బందికి శిక్షణ

విశాలాంధ్ర-బొబ్బిలి: ఎంపీడీవో కార్యాలయం విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్, ధాన్యం కొనుగోలు కేంద్రం నకు సంబంధించిన టెక్నికల్ అసిస్టెంట్స్, డేటా ఎంట్రీ ఆపరేటర్స్ మరియు ప్రాథమిక సహకార సంఘాలు సిబ్బంది వారికి ధాన్యం కొనుగోలు కు సంబంధించి శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఉప తహశీల్దార్ రెడ్డి సాయి కృష్ణ కుమార్ , విజయనగరం డిఎం, పౌర సరఫరాలు కార్యాలయం నుండి టెక్నికల్ అసిస్టెంట్స్ మరియు టిసిఎస్ సిబ్బంది హాజరైనారు.

జిల్లాను డ్రగ్స్, గంజాయి రహిత జిల్లా గా మార్చేందుకు చర్యలు తీసుకోండి

జిల్లా ఎస్పీ కి విజ్ఞప్తి చేసిన గురాన అయ్యలు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : గంజాయి, డ్రగ్స్ అక్రమ రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, నిరంతరమైన నిఘాను ఏర్పాటు చేసి గంజాయి, డ్రగ్స్ నిర్మూలించాలని జనసేన నేత గురాన అయ్యలు ...జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ కి విజ్ఞప్తి చేశారు...జిల్లాను డ్రగ్స్, గంజాయి రహిత జిల్లా గా మార్చేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అయ్యలు మాట్లాడుతూ నేటి యువత గంజాయి, డ్రగ్స్‌కు బానిసలై తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. అత్యంత ప్రమాదకరమైన మత్తు పదార్ధాలను సేవించడంతో సకల అనర్ధాలకు కారణమవుతున్నారన్నారు. నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా గంజాయి, డ్రగ్స్ దందా విస్తరిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. బడిపిల్లల నుంచి వర్సిటీ విద్యార్థులు, రోజు కూలీ నుంచి సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, వ్యాపారుల వరకు ఈ మత్తు మహ మ్మారికి బానిసలౌతున్నారని తెలిపారు. గంజాయి, డ్రగ్స్ నివారణకు కృషి చేయాలని కోరారు. గంజాయి అక్రమ రవాణా నియంత్రకు దాడులు ముమ్మరం చేయాలని, ఆకస్మికంగా లాడ్జిలు, వాహనాలు తనిఖీ చేయాలని కోరారు. ఇతర రాష్ట్రాల నుండి వచ్చి, తాత్కాలికంగా నివాసం ఏర్పరుచుకునే వ్యాపారులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, వారు చేసే వ్యాపారులు, తీసుకు వస్తున్న సరుకులు, వాటిని స్టోర్ చేసే గోడౌన్ లను తనిఖీ చేయాలని కోరారు. లంకా పట్టణం, జొన్నగుడ్డి, వైఎస్ఆర్ నగర్, దాసన్నపేట, గాజులరేగ, పూలబాగ్ కాలనీ ప్రాంతాల్లో యువతను చైతన్యపర్చి కౌన్సిలింగ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జనసైనికులు పి. రవీంద్ర, ఎంటి రాజేష్ , ఎమ్ . పవన్ కుమార్ , పృధ్వీ భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత నమోదు కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలి

పార్టీ సభ్యత్వాన్ని తీసుకున్న వారికి రూ. 5 లక్షల ప్రమాద బీమా

ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి

విశాలాంధ్ర-శృంగవరపుకోట టౌన్ : తెలుగుదేశం పార్టీ సభ్యత్వ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి. తెదేపా పార్టీ సభ్యత్వం తీసుకోవడం ద్వారా పలు ప్రయోజనాలు ఉన్నాయని వాటిని ప్రజలకు వివరించాలని శృంగవరపుకోట నియోజకవర్గ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి తెలిపారు. శుక్రవారం పుణ్యగిరి లేఅౌట్ దగ్గిరలో పట్టణ టౌన్ పార్టీ ఉపాధ్యక్షులు పొట్నూరు అప్పలరాజు (సాయిరాం) ఆధ్వర్యంలో జరిగిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలతో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ" ఎస్.కోట మండలంలో గల తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు తమ తమ గ్రామాల్లో పార్టీ సభ్యత నమోదు కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తిచేయాలన్నారు. సభ్యత్వ నమోదు చాలా సులభమైన ప్రక్రియని ఉన్న చోటు నుంచే మొబైల్ ద్వారా వాట్సాప్, టెలిగ్రామ్ లేదా వెబ్సైట్ నుంచి ఆన్లైన్లో కొత్త సభ్యత్వాన్ని స్వీకరించవచ్చని తెలిపారు. పాత సభ్యత్వాన్ని రెన్యువల్ చేసుకోవడం జీవితకాల సభ్యత్వాన్ని పొందడంతో పాటు కుటుంబ సభ్యులు స్నేహితులను పార్టీలో చేర్పించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని నేతలు కార్యకర్తలకు ఎమ్మెల్యే సూచించారు. పార్టీ సభ్యత్వాన్ని తీసుకున్న వారికి రూ. 5 లక్షల ప్రమాద బీమా ఉంటుందని తెలిపారు. గతంలో ఇది రూ. 2 లక్షలు మాత్రమే ఉండేది అన్నారు. సభ్యత్వం ఉన్న కుటుంబాల్లోని విద్యార్థుల చదువుకు తెలుగుదేశం పార్టీ ఆర్థిక సహాయం అందిస్తుందని, అలాగే ఉపాధి లేని వారికి పార్టీ సాధికారత విభాగం ద్వారా నైపుణ్య శిక్షణ ఇవ్వడంతో పాటు ఉద్యోగ అవకాశం కల్పిస్తుందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చెక్క కిరణ్ కుమార్ ,పెదగడా రాజు ,రాజేంద్ర ,రవీంద్ర ఎస్.కోట మండల మరియు టౌన్ తెలుగు దేశం పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ చట్టంపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరం : కలెక్టర్ అంబేద్కర్

విశాలాంధ్ర -లక్కవరపుకోట: షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు చట్టంపై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ అన్నారు. శుక్రవారం మండలంలోని జమ్మా దేవి పేట పంచాయితీ గోల్డ్ స్టార్ కూడలిలో వెంకట సాయి కళ్యాణ మండపంలో విశాఖపట్నం రీజనల్ సి. ఐ. డి అడిషనల్ ఎస్పీ డాక్టర్. జి ప్రేమ కాజల్ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్ టి అట్రాసిటీ చట్టంపై ఒకరోజు అవగాహన కార్యక్రమం నిర్వహించిన సందర్భంగా ముఖ్యఅతిథిగా కలెక్టర్ అంబేద్కర్ పాల్గొని మాట్లాడుతూ సమాజంలో అత్యంత ఆర్థికంగా వెనుకబడి ఉన్న ఎస్సీ ఎస్టీలు కులాలవారు దాడులకు గురై మానసిక వేదన తో బాధపడుతున్నారని స్వతంత్రం రాకముందు సాటి మనుషులను మనుషులుగా అగ్రకులం వారు గుర్తించేవారు కాదని స్వాతంత్రం వచ్చిన తర్వాత భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ భారతదేశ రాజ్యాంగం రచించి అందించి ఎస్సీ ఎస్టీలను సమానంగా చూడాలని సమాజం గుర్తించే విధంగా ఉండాలని రాజ్యాంగంలో పొందుపరిచారని ఆ దిశగా 19 89 లో ఎస్సీ ఎస్టీలకు ప్రత్యేకంగా అత్యాచారాల నిరోధక చట్టాన్ని తీసుకురావడం జరిగిందని అప్పుడే నిజంగా అత్యాచారాలకు గురవుతున్న షెడ్యూల్ కులం షెడ్యూల్ తెగలు కులాలకు రక్షణ ఉంటుందని చట్టంలో రూపొందించబడిందని తెలిపారు. ప్రతి ఒక్కరూ చట్టం పట్ల పూర్తి అవగాహన కలిగి అత్యాచారాల నిరోధకాన్ని కాపాడుకోవాలని అన్నారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం అన్ని చట్టాల కంటే చిన్నదని దీనిని పరిరక్షించుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని విద్యార్థుల దగ్గర నుంచి ప్రతి గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ఇంకా ఎప్పటికీ గ్రామీణ ప్రాంతాలలో వివిధ రూపాలలో తీవ్రమైన అత్యాచారాలు జరుగుతున్నాయని వీటిని నిరోధించడానికి షెడ్యూల్ కులము షెడ్యూల్ తెగలు అత్యాచారాలు నిరోధక చట్టం కఠినంగా పరిగణించబడుతుందని ఎంతటి వారినైనా కట్ట పరంగా చర్యలు తీసుకుని చట్టాన్ని కాపాడవలసిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. అత్యాచారాలకు గురైనటువంటి ప్రతి బాధితులకు ప్రభుత్వ పరంగా అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని ఆయన తెలిపారు. ఎస్పీ వసూల్ జిందాల్ మాట్లాడుతూ నేటికీ చాలాచోట్ల ఎస్సీ ఎస్టీ ల అత్యాచారాలు జరుగుతున్నాయని ఫిర్యాదులు అందిన వెంటనే కేసులు నమోదు చేసి దర్యాప్తు చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. వాస్తవానికి నిజంగా అత్యాచారం జరిగిన వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్కు వెళ్లి రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలని వెంటనే ఎస్సీ ఎస్టీ డిఎస్పి ద్వారా దర్యాప్తు చేసి చర్యలు తీసుకుంటామని అన్నారు. నేటి సమాజంలో మనుషుల్ని మనుషులుగా గుర్తించాలని అత్యాచారాలకు పాల్పడకూడదని అన్నారు. అట్లా జరిగిన వెంటనే తీవ్రమైన పరిణామాలు ఉంటాయి అన్నారు. చట్టం పట్ల ప్రతి ఒక్కరు అవగాహన చేసుకుని చట్టాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా అందరి పైన ఉందని అన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లా పరిధిలో అత్యాచారాల నిరోధక చట్టం పై జిల్లా కలెక్టర్ చైర్మన్ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మండల స్థాయిలో తహసిల్దార్ ఆధ్వర్యంలో మండల మానేట్రింగ్ కమిటీ సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. అత్యాచారాలు జరగకుండా చట్టంపై అవగాహన అందరికీ కలిగి ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. సీనియర్ పి పి కే కేశవరావు, విజయనగరం ఎస్సీ ఎస్టీ విభాగం డిఎస్పి ఎం వీర కుమార్, సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకులు బి రామానందం,, ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు బి భానుమూర్తి, కొత్తవలస కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు డిఎల్ దేవి, సిఐడి డి.ఎస్.పి ఎం. ఎన్ భూపాల్, తహసిల్దార్ డి ఎం జి ఎన్ ప్రసాద్ రావు, సిఐడి సీఐలు పీ వి వి నరసింహారావు, జీవీ రమణ, మాల మహానాడు ఉత్తరాంధ్ర జిల్లాల ఉపాధ్యక్షుడు గొల్ల ఈశ్వరరావు, దళిత మహాసభ ఉత్తరాంధ్ర జిల్లాల ఉపాధ్యక్షుడు రెట్టపల్లి అప్పన్న పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో సిఐడి డిపార్ట్మెంట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నిత్య సేవకున్ని గుర్తించండి..

విశాలాంధ్ర-విజయనగరం: తెలుగుదేశం పార్టీలో నిత్యసేవకునిగా ఉంటూ, అశోక్ గజపతిరాజు వీరవిదేయునిగా పేరు తెచ్చుకున్న నేత జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు. తాజాగా తన సేవలను గుర్తించాలని అధిష్టానంను కోరుతున్నారు. త్వరలో జరగబోయే నామినేటెడ్ పోస్టుల భర్తీలో తనకు ప్రాదాన్యత ఇవ్వాలని ఇప్పటికే ఆయన పెద్దలను కోరారు. రెండు రోజులుగా అమరావతిలో ఉన్న ఆయన రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌తోపాటు పలువురు పెద్దలను కలిసి తన మనసులో మాటను తెలియజేసారు. రాజుగారి ఆశలు నెరవేరుతాయో లేదో చూడాలి.

సాగునీటి సంఘం ఎన్నికలపై సిబ్బందికి శిక్షణ

విశాలాంధ్ర-భోగాపురం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సాగునీటి సంఘం ఎన్నికలకు సంబంధించిన ఎన్నికల సిబ్బందికి శుక్రవారం శిక్షణ ఇచ్చారు. తహసీల్దార్ ఎం సురేష్ మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ చేసే రైతులు 1432 ఫసలీ వరకు భూమి శిస్తు చెల్లించిన వారు పోటీకి అర్హులని అన్నారు. మండలంలోని నాలుగు సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించి నియమించిన ఎన్నికల సిబ్బందికి సూచనలు, సలహాలను ఆయన అందజేశారు. నీటిపారుదల శాఖ ఏ ఈ కనక మహాలక్ష్మి మాట్లాడుతూ ఇప్పటికే ఓటర్లను గుర్తించడం జరిగిందని అన్నారు. ఎన్నికల రోజు ప్రతి ఒక్కరు హాజరు కావాలని ఎన్నికల సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి హరికృష్ణ, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టల్ ద్వారా బ్యాంకు ఎకౌంట్లతో ఆధార్ అనుసంధానం సులభతరం

నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య

విశాలాంధ్ర -విజయనగరం అర్బన్ : నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నేతృతంలో ప్రజల బ్యాంకు ఎకౌంటులతో ఆధార్ అనుసంధాన ప్రక్రియను పోస్టల్ శాఖ సేవల ద్వారా మరింత సులభతరంగా చేపట్టనున్నామని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పి. నల్లనయ్య పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం విజయనగరం నగరపాలక సంస్థ కార్యాలయం నందు పోస్టల్ శాఖ అధికారులు, వెల్ఫేర్ మరియు ఎడ్యుకేషన్ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ పి. నల్లనయ్య మాట్లాడుతూ ప్రతి సచివాలయ పరిధిలో కార్యదర్శులు ప్రజల అకౌంట్లను ఆధార్ తో అనుసంధానిస్తున్నారు. దీనివల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని, ప్రభుత్వం నుండి మంజూరయ్యే ఆర్థికపరమైన అంశాలు సులభతర రీతిలో జరిగేందుకు ఎన్.పి.సీ.ఐ విధానం శ్రేయస్కరమని ఆయన తెలిపారు. ఇందుకోసం ఇదివరకే బ్యాంక్ అకౌంట్లు ఉన్నవారికి ఆధార్ తో అనుసంధానం చేస్తున్నారని, అయితే ఇంకా 44,479 మంది అకౌంట్లు అనుసంధానం కాలేదని తెలిపారు. కాబట్టి అకౌంట్లు లేని వారి కోసం సులభతర రీతిలో అకౌంట్లు తెరిచేందుకు పోస్టల్ శాఖ సహాయాన్ని కోరామన్నారు. ముందుగా ప్రతి సచివాలయ పరిధిలో ఎడ్యుకేషన్ మరియు వెల్ఫేర్ కార్యదర్శులు లబ్ధిదారుల జాబితాను తయారుచేసి పోస్టల్ శాఖకు నివేదించినట్లయితే ఆ శాఖ ప్రతినిధులు, అందరితో ఒకే సమయంలో పోస్టల్ అకౌంట్లు తెరిపించే ఏర్పాట్లు చేస్తారన్నారు. తద్వారా సమయం ఆదాతో పాటు సులభతర రీతిలో ఈ విధానం సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిపిఆర్ఓ సింహాచలం పాల్గొన్నారు.

దోమల వృద్ధి నియంత్రణకు దోహదపడాలి

విశాలాంధ్ర-విజయనగరం అర్బన్ : ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి దోమల వృద్ధి నియంత్రణకు దోహదపడాలని ప్రజలకు విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య స్పష్టం చేశారు. ఈ మేరకు ప్రజలలో మరింత విస్తృత అవగాహన కల్పించాలని సచివాలయ కార్యదర్శులకు ఆదేశించారు. దీంతో ప్రతి శుక్రవారం శానిటేషన్ కార్యదర్శులు, ఏఎన్ఎంలు టీములుగా ఇంటింటికి వెళ్లి నీటి నిల్వలను శుభ్రపరచి ప్రజలను చైతన్య పరుస్తున్నారు. ఇందులో భాగంగా ఈరోజు శుక్రవారం కావడంతో ప్రతి ఒక్కరు డ్రైడేను పాటించాలని అవగాహన కల్పిస్తున్నారు. ఇళ్లలో నిల్వ ఉన్న నీటి వల్ల దోమలు గుడ్లు పెట్టి లార్వా ఉత్పత్తి చేసే అవకాశం ఉంటుందని అన్నారు. ముఖ్యంగా ఫ్రిడ్జుల కింది భాగంలో నిల్వ ఉన్న నీటి వలన, అలాగే కొబ్బరి చిప్పలు, టైర్లు, పాడైన ట్యాంకులు వంటి ఇతర నిరుపయోగ వస్తువులలో నీరు ఎక్కువగా నిల్వ ఉండటం వల్ల దోమల వృద్ధికి ఆవాసాలుగా మారుతున్నాయని అన్నారు. కావున ప్రతి ఒక్కరు తమ పరిసరాలలో నీటి నిల్వలను లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రపరుచుకోవాలని చెప్పారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించడం వల్ల మరింత మెరుగైన ఫలితాలు వస్తాయన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

గ్రోత్ సెంటర్ ఎండిఎ ఫెర్రో ఎలాయిస్ కంపెనీలో మృతి చెందిన రామారావు కుటుంబానికి రూ. 25 లక్షలు పరిహారం ఇవ్వాలి : సిటూ

విశాలాంధ్ర-బొబ్బిలి : పట్టణం గ్రోత్ సెంటర్ నిన్న జరిగిన ప్రమాదంలో మరణించిన గేదెల రామారావుకు 25 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని సిఐటీయు జిల్లా అధ్యక్షులు పి. శంకర్రావు సిఐటీయు గ్రోత్ సెంటర్ నాయకులు ఎస్. గోపాలు, శ్రామిక మహిళ నాయకురాలు కె. పుణ్యవతి డిమాండ్ చేశారు. ఈ ప్రమాదాలు కంపెనీలో భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వలన తరచూ కంపెనీలో కార్మికులు చనిపోతున్నారని అన్నారు. గతంలో బెర్రీ కంపెనీలో గ్యాస్ లీకేజీలో 5 బీహార్ కి చెందిన కార్మికులు చనిపోతే చడి చప్పుడు లేకుండా పోలీసులును, జిల్లా అధికారులు మేనేజ్ చేసి కేసులు లేకుండా యాజమాన్యం బీహార్ కార్మికుల కుటుంబాలను మోసం చేసిందని అన్నారు. గ్రోత్ సెంటర్ లో ముఖ్యంగా ఈ కంపెనీల్లో భద్రత ప్రమాణాలు పాటించడం లేదని అన్నారు. గ్రోత్ సెంటర్ యాజమాన్యాలు ఒక చీకటి సామ్రాజ్యాన్ని నడుపుతున్నాయని అన్నారు కార్మికులకు కనీస వేతనాలు పిఎఫ్ ఈఎస్ఐ మౌలిక సౌకర్యాలు ఏవి లేకుండా బానిసలు కంటే హీనంగా పనిచేస్తారని అన్నారు. లేబర్ అధికారులు, ఫ్యాక్టరీ ఇన్స్పెక్టర్ ఏ ఒక్కరిని లోపలికి రానివ్వరని అన్నారు. సంఘాలు పెట్టనివ్వకుండా ఆ చుట్టూ ఉన్న గ్రామాల్లో కొంతమంది పెద్దలను తమ చెప్పు చేతల్లో పెట్టుకొని కాంట్రాక్టర్లు ఇచ్చి కార్మిక వర్గానికి తీవ్రమైన ద్రోహం చేస్తున్నారు. జిల్లా అధికారులు ప్రభుత్వం వీళ్ళ పైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని చనిపోయిన కార్మికులకు 25 లక్షలు ఇచ్చి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

గంజాయి కేసులో వ్యక్తి అరెస్టు

విశాలాంధ్ర-రామభద్రపురం : గంజాయి కేసులో ఒక వ్యక్తిని శుక్రవారం అరెస్ట్ చేశామని రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ నారాయణరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం పాడేరు జిల్లా పెదబయలు కు గొల్లంగి రమేష్ కుమార్ పై 2019 జూన్ 17న ఒక గంజాయి కేసు నమోదయిందని అన్నారు. ఆ కేసులో భాగంగా 226 కిలోలు గంజాయి ఐసర్ వ్యాన్లు తరలిస్తుండగా కాకర్లవలస జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీల్లో భాగంగా ఆ వ్యాను ను తనిఖీ చేయగా 226 కిలోలు గంజాయి లభ్యమయింది. అప్పట్లో స్థానిక పోలీస్ స్టేషన్లో ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు అయింది. ఈ కేసులో డ్రైవరు తప్పించుకొని పారిపోయాడు. ఐదు సంవత్సరాల తర్వాత మండల కేంద్రంలో బైపాస్ జంక్షన్లో అనుమానాస్పదంగా తిరగడంతో అతను పోలీసులు అదుపులోనికి విచారించగా పోలీసులు ఎక్కడెక్కడ కా వల ఉన్నారో తెలుసుకునేందుకు ముందుగా రెక్కీ నిర్వహిస్తున్నానీ దానిలో భాగంగానే శుక్రవారం రామభద్రపురం రావడం జరిగిందని అన్నారు. ముద్దాయిను అదుపులోకి తీసుకొని అదనపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచయమని తెలిపారు. ఈయనకు కోర్టు రిమాండ్ విధించిందని అన్నారు.

పోగొట్టుకున్న మొబైల్‌ను కనుగొనేందుకు

ప్రత్యేకంగా మిస్సింగు మొబైల్ ట్రాకింగ్ సిస్టం ఏర్పాటు

ఎస్పీ వకుల్ జిందల్

ఫిర్యాదుల స్వీకరించేందుకు ప్రత్యేకంగా మొబైల్ నంబరు 8977945606 ఏర్పాటు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పోగొట్టుకున్న మొబైల్స్‌ను ట్రేస్ చేసి, వాటిని తిరిగి బాధితులకు అందజేసేందుకు జిల్లాలో ప్రత్యేకంగా "మిస్సింగు మొబైల్ ట్రాకింగ్ సిస్టం"ను ఏర్పాటు చేస్తున్నట్లుగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ నవంబరు 8న జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ - వివిధ ప్రాంతాల్లో మొబైల్స్ ను పోగొట్టుకున్న బాధితులు ఇకపై పట్టణంలోని సైబరు సెల్ కార్యాలయంకు రావాల్సిన అవసరం లేదని, తమకు దగ్గరలోని పోలీసు స్టేషన్ను సంప్రదించి, మొబైల్ పోయినట్లు లేదా మిస్ అయినట్లుగా ఫిర్యాదు చేయవచ్చునన్నారు. అదే విధంగా 8977945606 అనే మొబైల్ నంబరుకు మొబైల్ పోగొట్టుకున్న మెసేజ్ పంపినట్లయితే ఒక గూగుల్ ఫారంను వారికి పంపడం జరుగుతుందన్నారు. ఈ గూగుల్ ఫారంలో పొందుపర్చిన వివరాలను మొబైల్ పోగొట్టుకున్న వ్యక్తులు పూర్తి చేసినట్లయితే, వాటిని ట్రేస్ చేసి, బాధితులకు తిరిగి అందజేస్తామని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. జిల్లాలో బాధితులు పోగొట్టుకున్న మొబైల్ ఫోనులను ట్రాక్ చేసేందుకు ప్రత్యేకంగా 'మిస్సింగు మొబైల్ ట్రాకింగ్'సిస్టం' ను ఏర్పాటు చేసామన్నారు. ఈ విధానంతో మొబైల్ పోగొట్టుకున్న వ్యక్తులు విజయనగరం పట్టణంలోని సైబరు సెల్ కార్యాలయంకు రావాల్సిన అవసరం లేదన్నారు. మొబైల్ పోగొట్టుకున్న వ్యక్తులు తమకు దగ్గరలోని పోలీసు స్టేషను సంప్రదించి, పోగొట్టుకున్న మొబైల్స్ వివరాలను అందించినట్లయితే, వారు సదరు ఫిర్యాదును 'మిస్సింగు మొబైల్ ట్రాకింగ్ సిస్టం' ద్వారా పోయిన మొబైలు ట్రాక్ చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. జిల్లా ప్రజలకు పోలీసు సేవలను మరింత సులభతరం చేసేందుకు 8977945606 మొబైల్ నంబరును ఏర్పాటు చేసామని, ఆ మొబైల్ నంబరుకు 'హాయ్' అన్న సందేశాన్ని పంపితే, వారు పంపిన మొబైలు ఒక గూగుల్ ఫారం వస్తుందన్నారు. ఈ గూగుల్ ఫారంను పూర్తి చేసి, తిరిగి 8977945606 పంపినట్లయితే, వారి ఫిర్యాదును నమోదు చేసుకొని, పోయిన మొబైల్ ను ట్రేస్ చేసేందుకు చర్యలు చేపడతామని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. జిల్లాలో సుమారు 5.5 కోట్ల విలువైన 3000 మొబైల్ ఫోన్లను ట్రాక్ చేసి, బాధితులకు ఇప్పటి వరకు అందజేయడం జరిగిందన్నారు. అదే విధంగా ప్రస్తుతం మరో 300 మొబైల్ ఫోనులను సైబరు సెల్ పోలీసులు, సిబ్బంది నిరంతరం శ్రమించి, ట్రాక్ చేయడం జరిగిందన్నారు. పోయిన మొబైల్స్ గురించిన ఫిర్యాదులను ప్రస్తుతం https://www.ceir.gov.in ఆన్ లైను ద్వారా స్వీకరించి, ట్రేస్ చేసి, బాధితులకు అందజేస్తున్నామని జిల్లా ఎస్పీ తెలిపారు. కొంతమంది నేరస్థులు గంజాయి అక్రమ రవాణ, హత్యలు, ఇతర నేరాలను చేసేందుకు వినియోగించిన తరువాత, ఆయా నేరాల నుండి తప్పించుకొనే క్రమంలో నేరస్థులు మొబైల్స్ పారేస్తారని, అటువంటి మొబైల్స్ ఎవరైనా వాడినట్లయితే పోలీసులు, కోర్టుల నుండి తీవ్ర పరిణామాలు ఎదురవుతాయని జిల్లా ఎస్పీ అన్నారు. కావున, ఎవరికైనా మొబైల్ దొరికితే వాటిని స్థానిక పోలీసు స్టేషనుకు అప్పగించాల్సిందిగా ప్రజలను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ కోరారు. అనంతరం, ట్రేస్ చేసిన 300 మొబైల్స్ ను బాధితులకు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ అందజేసారు. బాధితులకు అందజేసిన వాటిలో 3 - ఐ ఫోన్లు, 26 - వన్ ప్లస్ ఒన్ ఫోన్లు, 32 సాంసన్ మొబైల్స్, 71 - వివో మొబైల్స్, 48 - రెడ్ మీ, 45 - ఒప్పో మొబైల్స్, 15 ఐక్యూ మొబైల్స్, 33 - రియల్ మీ, 15 - పోకో ఫోన్లు,7 - ఇన్ఫినెక్స్, 4 - మోటోరోలో మొబైల్స్, ఒక ఆక్సిస్ ఎన్ మొబైల్ ఉందని, మొత్తం 300 మొబైల్స్ విలువ రూ. 56.47 లక్షలు ఉంటుందని జిల్లా ఎస్పీ తెలిపారు. పోగొట్టుకున్న మొబైల్స్ ను తక్కువ వ్యవధిలోనే తిరిగి తమకుఅప్పగించిన సైబర్ సెల్ పోలీసులకు, జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ గార్కి బాధితులు కృతజ్ఞతలు తెలిపి, తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, విజయనగరం డీస్పీ ఎం.శ్రీనివాసరావు, సైబరు సెల్ సిఐ ఎల్. అప్పల నాయుడు, ఎస్పీ సిఐలు ఎ.వి.లీలారావు, ఆర్.ఎస్.ఆర్.కే.చౌదరి, సైబరు సెల్ ఎస్సై లు ప్రశాంత కుమార్, నజీమా బేగం మరియు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అవంతీస్ ఇంజినీరింగ్ కాలేజీలో స్వాగతోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-గరివిడి: స్థానిక గరివిడి అవంతీస్ సెయింట్ థెరిస్సా ఇంజనీరింగ్ కాలేజీలో శుక్రవారం ఉదయం ప్రిన్సిపాల్ డాక్టర్ వి.జాషువా జయప్రసాద్ అధ్యక్షతన స్వాగతోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి వైస్ ఛాన్సలర్ జేఎన్టీయూ గురజాడ విజయనగరం నుండి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరి జీవితంలో విద్యార్థి దశ అమూల్యమైందని అని తెలుపుతూ విద్యార్థులు సృజనాత్మకతతో ఉద్యోగ, ఉపాధికి అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకొని అత్యున్నత స్థాయికి చేరుకోవాలన్నారు. అలాగే సీనియర్ విద్యార్థులను జూనియర్ విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి అతిథిగా డాక్టర్ ఎల్.విజయలక్ష్మి ప్రిన్సిపాల్ గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజ్,చీపురుపల్లి నుండి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానము సామాన్యులను ముంగిట చేరటానికి ఇంజనీర్లుగా కృషి చేయాలని కోరారు. అభివృద్ధికి సాంకేతిక విద్య ప్లాట్ ఫామ్ లాంటిదని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఉత్తమ ఇంజనీర్లుగా వెలుగొంది భారతదేశ అభివృద్ధికి తోడ్పడాలని,దేశ పురోగతి మన యువత పైన ఆధారపడి ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి మరొక గౌరవ అతిథిగా టి.సురేష్ కుమార్ లీడ్ కన్సలంట్ విప్రో,విశాఖపట్నం నుండి విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల యొక్క అకాడమిక్ రికార్డు బాగుండాలని,కంప్యూటర్ లాంగ్వేజ్లను పెంపొందించుకొనుట ద్వారా ప్రాంగణ ఎంపికల్లో సులువుగా సెలెక్ట్ అవ్వచ్చని తెలిపారు. మరొక అతిథిగా బ్రహ్మకుమారి హేమలత పాల్గొని మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి సెల్ఫ్ మోటివేషన్,పాజిటివ్ యాటిట్యూడ్ తో మెలగాలని కోరారు. ఈ సందర్భంగా రాష్ట్ర మాజీ మంత్రివర్యులు అవంతి విద్యాసంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ గత 23 సంవత్సరాలు నుండి గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్యను అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు ప్రాంగణ ఎంపికలకు అవసరమైన కమ్యూనికేషన్ స్కిల్స్,టెక్నికల్ స్కిల్స్ పెంపొందించే విధంగా కళాశాలలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. కావున విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయిలో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అతిథులతో కలిసి అవంతి క్రోనికల్ న్యూస్ లెటర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అవంతి విద్యా సంస్థల ప్రతినిధి ఎమ్.మహేష్,అవంతి విద్యాసంస్థల డైరెక్టర్ ఏ. చంద్రశేఖర్ ,వైస్ ప్రిన్సిపల్ బి.వెంకటరమణ,ఏఓ జి.అనిల్ కుమార్,వివిధ విభాగాధిపతులు, ఉపాధ్యాయులు,విద్యార్థులు బోధనేతర సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

ల్యాండ్ గ్యాంబ్లింగ్ చట్టం అందరికీ వర్తించాలి

గద్దె డిమాండ్

విశాలాంధ్ర-చీపురుపల్లి: అక్టోబర్ 8. 1982 ల్యాండ్ క్యాంబ్లింగ్ చట్టం ప్రకారం భూములను అన్యక్రాం తంగా ఆక్రమించిన వారి పైన చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని మాజీ విప్ గద్దె బాబురావు డిమాండ్ చేశారు. శుక్రవారంనాడు చీపురుపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల ముగిసిన క్యాబినెట్ మీటింగ్లో ల్యాండ్ క్యాంప్లింగ్ యాక్ట్ పునరుద్ధరించి అమల్లోకి తీసుకువచ్చారన్నారు. ఈ చట్ట ప్రకారం ఎవరైనా భూములను ఆక్రమించుకుంటే వారికి జీవితకాలం 14 వేల పాటు జైలు శిక్ష విధించవచ్చునన్నారు. ఎంతటి వారైనా ఎవరైనా సరే ఈ చట్ట ప్రకారం భూ ఆక్రమణకు పాల్పడితే శిక్షకు అర్హులని ఆయన అన్నారు. చివరికి ప్రభుత్వం కూడా భూములను ఆక్రమించుకోకుండా ఈ చట్టం వర్తింపచేయాలన్నారు. గతంలో జిరాయితీలుగా ప్రభుత్వం అమ్మ చూపిన భూములే మళ్లీ ప్రభుత్వ భూములుగా, చెరువులుగా రికార్డు చూపించడం సూచన ఏమన్నారు,. చట్ట ప్రకారం భూ ఆక్రమణకు పాల్పడిన వారు ఎంతటి వారైనా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా ఇటీవల ముగిసిన దేవాలయాల కమిటీల్లో వార్షిక ఆదాయం దేవాలయమునకు సంబంధించి 50 వేలు మించి ఉంటే అక్కడ పనిచేస్తున్న పూజారికి 15వేల రూపాయల జీతాన్ని కేటాయించడం శుభసూచకం అన్నారు. ఈ నేపథ్యంలో 50 లక్షల వార్షిక ఆదాయం మించి ఉన్న ఆలయాల్లో ఎంతమంది పూజారులు నియమించారు వారికి ఎంతెంత జీతాలు ఇవ్వాలని ప్రభుత్వం స్పష్టత చేయాలన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు,బ్రేక్ దర్శనం ఇప్పించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. శ్రీ వెంకటేశ్వరుని దయవలన రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు పాలనతో పాటు తెలుగుదేశం పార్టీ కూడా అభివృద్ధి పనులు నడుస్తుందన్నారు. మాజీ ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీల బ్రేక్ దర్శనం సంబంధించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లనున్నారు. ఇదిలా ఉండగా సోషల్ మీడియా ద్వారా జరుగుతున్న ప్రచారాలను మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఖండించాలన్నారు.

న్యాయ సేవల దినోత్సవం పై అవగాహన

విశాలాంధ్ర-శృంగవరాపుకోట టౌన్: న్యాయ సేవల దినోత్సవం సందర్భంగా నేడు శృంగవరపుకోట కోర్టు ఆవరణలో జూనియర్ సివిల్ జడ్జి మరియు మండల న్యాయ సేవా కమిటీ చైర్మన్ కుమారి సబ్బవరపు వాణి అధ్యక్షతన న్యాయ అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ ఆర్థికంగా గాని సామాజికంగా గాని మరి ఏ ఇతర కారణాల వలన వెనుకబడిన వాళ్లకి న్యాయం అందకుండా ఉండే పరిస్థితులను రూపుమాపడానికి న్యాయ సేవ అధికార చట్టం 1995 నవంబర్ 9న ఏర్పాటు చేయబడిందని ఈ సందర్భంగానే ప్రతి సంవత్సరము నవంబర్ 9న న్యాయ సేవల దినోత్సవం జరపబడుతుందని తెలియజేసిరి. ఈ చట్టం ప్రాతిపదికనే తాలూకా స్థాయి నుండి జాతీయ స్థాయి వరకు ప్రతి న్యాయస్థాన ప్రాంగణంలో న్యాయ సేవ సంస్థలను ఏర్పాటు చేయబడ్డాయని వీటి ద్వారా పేదలకు ఉచితంగా న్యాయ సహాయము అందించడమే కాకుండా వారికి ఉన్న వివాదాలకు ప్రభుత్వము తరపున ఉచితంగానే న్యాయవాదిని నియమించి కేసులను న్యాయస్థానంలో నడిపించుకొనుటకు అవకాశం కల్పించబడుతుందని మరియు సివిల్ కేసులు గాని రాజీ ఆమోదయోగ్యమైన క్రిమినల్ కేసులు గాని ఇరువక్షాలు రాజీ అయ్యే అవకాశం ఉన్నట్లయితే ఆ కేసులను రాజీ పరిష్కారం చేసి సివిల్ కేసులలో వాది చెల్లించిన కోర్టు ఫీజును తిరిగి వాపస్ ఇచ్చే విధానము ఈ చట్టం కల్పించబడిందని తెలియజేసిరి. నేడు న్యాయ సేవా సంస్థలు విస్తృతమైనటువంటి సేవలను అందిస్తున్నాయని ప్రభుత్వపరంగా ప్రజలకు అందజేయబడుతున్న సంక్షేమ పథకాలు గాని వసతి సౌకర్యాలు గాని మరి ఏ ఇతర విషయాలు ప్రజలకు అర్హత ప్రకారము అందని పక్షంలో ఈ న్యాయ సేవ సంస్థలను సంప్రదించడం ద్వారా తగు పరిష్కారము చేయబడుతుందని ఈ సందర్భంగా తెలియజేసిరి. కేవలం కోర్టు బయట ఉన్న కక్షిదారులకే కాకుండా కారాగారాలలో ఉన్న ఖైదీలకు కూడా వారి యొక్క ఆర్థిక పరిస్థితులను బట్టి ఉచితంగా క్రిమినల్ కేసులలో బెయిల్ కేసు విచారణ వంటి అంశాలకు న్యాయవాదులను నియమించడం జరుగుతుందని తెలియజేసిరి. ఎవరికైనా న్యాయపరమైన ఒక సమస్య ఉన్న ఎడల ఆ సమస్యను ఒక కాగితం ద్వారా సంబంధిత న్యాయ సేవా సంస్థలలో సమర్పించడం ద్వారా ఆ సమస్యకు సంబంధించిన ఇరువు వర్గాలను పిలిపించి సామరస్య పూర్వక వాతావరణంలో కేసు విచారణ జరిపి రాజీ ఆమోదయోగ్యము అయ్యేటట్లుగా ప్రయత్నించడం జరుగుతుందని తెలియజేసిరి. నేడు లోక్ అదాలత్ గాని న్యాయ సేవ సంస్థలు అందిస్తున్న సేవలను గాని వినియోగించుకోవడం ద్వారా కక్షిదారులు వారి యొక్క ధనాన్ని కాలాన్ని వృధా చేసుకోకుండా వెంటనే పరిష్కార మార్గము దొరకడానికి అవకాశం ఉంటుందని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమములో శృంగవరపుకోట న్యాయవాదుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు జి. నూరిదేముడు, బి.సత్యన్నారాయణ, మాజీ అధ్యక్షుడు అల్లు. సత్యాజీ, యమ్.అనురాధ, బొబ్బిలి రామకృష్ణ ప్రసంగించారు. స్పెషల్ జ్యుడిషల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ జి.అప్పలనాయుడు, సీనియర్ న్యాయవాదులు ఎం. కామేశ్వర రావు, జి.ప్రకాష్ రావు మరియు ఇతర సీనియర్ మరియు జూనియర్ న్యాయవాదులే కాకుండా కక్షిదారులు అధిక సంఖ్యలో హాజరవడం జరిగింది.

35 బియ్యం బస్తాలు వితరణ

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : జిల్లా ఆర్యవైశ్య మిత్రుల చారిటీ గ్రూప్ ద్వారా 35 బస్తాలు బియ్యం అన్న క్రతువుకు వితరణ చేశారు. స్థానిక శ్రీ పంచముఖ ఆంజనేయ నిత్య అన్న ప్రసాద వితరణ ట్రస్ట్ ఆధ్వర్యంలో అయ్యప్ప మాలాదారుల కోసం నిర్వహించబడుతున్న మహా అన్నదాన క్రతువుకు శుక్రవారం 35 బస్తాలు బియ్యం మిత్రుల సహకారంతో అందజేసినట్లు చారిటీ గ్రూప్ అధ్యక్షుడు ఆలవెల్లి శేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన వారికి విద్య,వైద్యం, వివాహం నిమిత్తం చారిటీ గ్రూప్ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రూప్ కార్యదర్శి డిమ్స్ రాజు, కోశాధికారి సముద్రాల నాగరాజు, బి.వి.పి.ఎస్. రామయ్య, మాచర్ల చంద్రశేఖర్ గుప్తా, కల్లూరి సతీష్, దేవాలయం కార్యదర్శి పెంటపాటి కామరాజు, కంది మురళీ నాయుడు స్వామి, సునీల్, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రమశిక్షణగా మెలగాలి

విశాలాంధ్ర-వేపాడ: పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణగా మెలిగిన నాడే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని మండల విద్యాశాఖ అధికారి-2 పి.బాల భాస్కర రావు అన్నారు. మండలంలోని కరక వలస, చామలాపల్లిలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను మండల విద్యాశాఖాధికారి పి.బాల భాస్కరరావు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాటశాల పరిసరాలు, తరగతి గదులు, మరుగుదొడ్లు, వంటగది, పరిశీలించారు. అలాగే విద్యార్థులను చదివించిన అంతరం తెలుగు,ఇంగ్లీష్,గణితం, ఈవీఎస్ వర్క్ బుక్స్ పరిశీలించారు. మొదటి సెమిస్టర్ వర్క్ బుక్స్ పూర్తి చేయించారు. అనంతరం రాగి జావ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే పాఠశాలలో నిర్వహించిన ఎస్ ఏ ఎం పి -2 ఇవి ఎస్ పరీక్షను పరిశీలించారు.

విద్యార్థులకు డయేరియా, అంటువ్యాధులపై అవగాహన

విశాలాంధ్ర-విజయనగరం అర్బన్ : స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా సచివాలయ కార్యదర్శులు విద్యార్థుల్లో కూడా అవగాహన తీసుకొస్తున్నారు. విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య ఆదేశాలతో ఆరోగ్య కార్యదర్శులు, ఏఎన్ఎంలు వివిధ పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు డయేరియా, ఇతర అంటువ్యాధుల గూర్చి అవగాహన కల్పిస్తున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబల కుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో తెలియజేస్తున్నారు. చేతులను ఎప్పటికప్పుడు శుభ్రపరుచుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తీసుకోవాలని, దోమతెరలు వినియోగించుకోవాలని పిల్లలలో చైతన్యం నింపుతున్నారు.

రాజాం లో విస్తృతంగా వాహన తనిఖీలు

అక్రమ మద్యం రవాణా నియంత్రనే లక్ష్యం

విశాలాంధ్ర. రాజాం ఈరోజు రాజాం నగర చివార్లలో గల పొగిరి, బొద్దాం వైపు పోవు రహదారి పై రాజాం, ప్రోహిబిషన్ & ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఆర్. జైభీమ్ ఆధ్వర్యంలో వాహన తనిఖీ లను విస్తృత స్థాయిలో చేపట్టారు. మద్యం అక్రమంగా రవాణా చేసేవారిని పట్టుకోవడానికి తద్వారా అన్నదికారికంగా మద్యం రవాణా చేసి గొలుసు దుకాణాలను ఏర్పాటును నిరోధించడానికి ఈ తనిఖీ లు నిర్వహిస్తున్నట్టు సీఐ తెలిపారు. ఎవరైనా వాహన చోదకులు 3 మద్యం సీసాల కంటే ఎక్కువగా కలిగి ఉంటే పట్టుకొని కేసు నమోదు చేస్తామని అంతే కాకుండా వారి రవాణా కు ఉపయోగించిన వాహనాలను కూడా కేసులో భాగంగా సీజ్ చేయడం జరుగుతుందని కూడా సీఐ తెలిపారు. ఇటువంటి వాహన తనిఖీలకు వాహన చోదకులందరు ఎక్సైజ్ శాఖ వారికి సహకరించివలిసిందిగా సీఐ కోరారు. ఈ తనిఖీ ల్లో ఎస్.ఐ. జి. ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మను బాగా చూసుకో షూటింగ్ ప్రారంభం.

సినిమాకు క్లాప్స్ కొట్టిన గొంప నాగభూషణం

విశాలాంధ్ర-వేపాడ : మండలంలోని బానాది గ్రామంలో అమ్మను బాగా చూసుకో షూటింగ్ శుక్రవారం ప్రారంభించారు. నూతన నటీమణులతో సినిమాను నిర్మిస్తున్నట్లు డైరెక్టర్ గొంప నాగభూషణం తెలిపారు. ఈ సందర్భంగా తన నివాసంలో క్లాప్స్ కొట్టి సినిమాను ప్రారంభించి ప్రస్తుతం సమాజంలో మానవతా విలువలతో కూడిన మన బంధాలను మరిచిపోతున్న తరుణంలో ఒక మంచి సినిమాను ప్రేక్షకులకు మంచి కథనంతో ప్రజాదరణ పొందే విధంగా సినిమాను నిర్మిస్తానని, నేటి యుగంలో తల్లిదండ్రులను అనాథాశ్రమంలో చేరవేయడం ఎంతో బాధాకరమని ఆ అంశమును స్ఫూర్తిగా తీసుకొని వేపాడ చుట్టుపక్కల గ్రామాలలో స్థానిక నటీ నటీమణులతో చక్కటి కథనం ప్రజలకు అందజేస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి రాష్ట్ర గ్రామ సేవా కోఆర్డినేటర్ సత్యనారాయణ, సత్యసాయి విజయనగరం జిల్లా సేవా కోఆర్డినేటర్ మనోహర్,కో డైరెక్టర్ నగేష్, అసోసియేట్ డైరెక్టర్ శ్రీను, అసిస్టెంట్ డైరెక్టర్ కన్నబాబు నటీనటులు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు వద్దమ్మా..!

విశాలాంధ్ర-గరివిడి: మండలంలో శివరాం గ్రామంలో 14 ఏళ్ల బాలికకు అదే గ్రామానికి చెందిన యువకుడితో బాల్య వివాహం చేసేందుకు ఇరు కుటుంబాలు నిశ్చయించుకున్న సమాచారం గరివిడి తహసిల్దార్ కు చేరింది. బాలిక తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి బాల్యవివాహాన్ని నిరోధించాలని తాసిల్దార్, తదితరుల సూచనలతో గురువారం శివరాం గ్రామానికి హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ బృందం చేరుకుని బాలిక తల్లి మీసాల లక్ష్మి, బాలిక మీసాల తులసి, ఇరువురికి బాల్య వివాహ అనర్థాలపై అవగాహన కల్పించడం జరిగింది. చిన్న వయసులో పెళ్లి చేయడం వల్ల శారీరక, మానసిక, ఎదుగుదల లేక ఆరోగ్య క్షీణించే అవకాశం ఉందని బాలిక తల్లికి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ రాష్ట్ర ప్రతినిధి భోగాపురపు శ్రీదేవి, రీజియన్ ప్రతినిధి ఎం హరీష్ కుమార్,జిల్లా ఉపాధ్యక్షుడు పోలీస్, చీపురుపల్లి నియోజకవర్గం అధ్యక్షుడు బూర సూర్యనారాయణ,మహిళా పోలీస్ సునీత, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుడు మృతి పై కేసు నమోదు

విశాలాంధ్ర-బొబ్బిలి : పట్టణం గ్రోత్ సెంటర్ ఎం. డి. ఏ మినరల్స్ దాతు ప్రైవేట్ కంపెనీలో మెకానికల్ హెల్పర్ గా పనిచేస్తున్న దత్తిరాజేరు మండలం స్టేషన్ బూర్జువలసకు చెందిన గేదెల రామారావు, (45) సం ఈనెల 7 న పనిచేస్తూ మొదటి అంతస్తు నుండి ప్రమాదవశాత్తు కింద పడిపోవడం వలన తల వెనుక భాగంలో బలమైన గాయం తగిలి, మెడి కవర్ హాస్పిటల్, విజయనగరం లో చికిత్స నిమిత్తం జాయిన్ చేశారు.. అయినప్పటికీ నిన్న రాత్రి పదిన్నర గంటల సమయంలో మృతి చెందడంతో మృతుడి భార్య గేదెల సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ సీఐ. కే. సతీష్ కుమార్ ఆదేశాల మేరకు, ఎస్సై ఆర్ రమేష్ కేసు నమోదు చేసి, పంచాయతీ దారుల సమక్షంలో శవ పంచినామా నిర్వహించి, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

బెల్ట్‌షాప్ నిర్వాహకులపై బైండోవర్ కేసులు నమోదు

విశాలాంధ్ర-రాజాం/రేగిడి. రాజాం మండలం రేగిడి అమూదాల వలస మండలా ల్లో రాజాం, ప్రొహిబిషన్ & ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఆర్. జైభీమ్ మొత్తం అరుగురిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. రాజాం మండలం పరిదిలో పొగిరి గ్రామానికి చెందిన ఇద్దరు, గడ్డిముడిదాం గ్రామానికి చెందిన ఒకరు, బొద్దాం గ్రామానికి చెందిన వారు ఒకరు, రేగిడి అమదాలవలస మండలం సరసనా పల్లి, బూరాడ గ్రామానికి చెందిన ఒక్కక్కరిని ఆయా మండలాల తహసీల్దార్ల ఎదుట హాజరు పరచి ఒక సంవత్సర కాలానికి బైండోవర్ చేయించడం జరిగింది. సదరు ఆరుగురు వ్యక్తులు గత వారం రోజుల్లో మద్యం సీసాలను అక్రమంగా అమ్ముతూ పట్టుబడి కేసు నమోదు కాబడినవారే. మరల వీరు అక్రమంగా మద్యం సీసాలతో పట్టుబడితే జైలు శిక్ష తో పాటు 50 వేల నుండి లక్ష రూపాయిలు అపరాద రుసుము చెల్లించ వలసి ఉంటుందని మండల తహసీల్దార్ వారు హెచ్చరించడం జరిగింది.

పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు

జిల్లా ఎస్పీ వకుల్ జిందల్

విశాలాంధ్ర -విజయనగరం టౌన్ : జిల్లా పోలీసుశాఖలో వివిధ హెూదాల్లో పని చేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపిఎస్ పోలీసు కార్యాలయంలో "పోలీసు వెల్ఫేర్ డే" నిర్వహించి, సిబ్బంది నుండి విజ్ఞాపనలు స్వీకరించి, పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శ్రీ వకుల్ జిందల్, ఐపిఎస్ మాట్లాడుతూ - పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, పోలీసు సంక్షేమానికి ప్రాధాన్యత కల్పిస్తానన్నారు. "పోలీసు వెల్ఫేర్ డే" నిర్వహించుటలో భాగంగా పోలీసు సిబ్బంది ఒక్కొక్కరిని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ జిల్లా పోలీసు కార్యాలయంలోని తన చాంబరులోకి పిలిచి, వారి వ్యక్తిగత, వృత్తిపరమైన, శాఖాపరమైన సమస్యలను తెలుసుకొని, వారి నుండి విజ్ఞాపనలు స్వీకరించారు. సిబ్బంది విజ్ఞాపనలు పరిశీలించిన జిల్లా ఎస్పీ, వాటి పరిష్కారానికి సానుకూలంగా స్పందించారు. పోలీసు సిబ్బంది తెలిపిన వ్యక్తిగత, శాఖాపరమైన సమస్యలను జిల్లా ఎస్పీ స్వయంగా పుస్తకంలో నోట్ చేసుకొని, వాటి పూర్వాపరాలు పరిశీలించి, పరిష్కరించేందుకు త్వరితగతిన చర్యలు చేపడతానని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు.

అసౌకర్యాలు నడుమ నీటి సంఘం ఎన్నికలు శిక్షణా తరగతులు

నిల్చొడానికి స్థలం లేదని సిబ్బంది అసహనం

విశాలాంధ్ర-తెర్లాం: మండలంలో శుక్రవారం తాసిల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సాగునీటి సంగం ఎన్నికల శిక్షణా తరగతులకు ఆదరణ సిబ్బందికి కనీసం నిల్చదానికి కూడా స్థలం లేదని మొత్తం 150 మంది సభ్యులు సెక్షన్ను హాజరైనప్పటికీ కార్యాలయము చాలక కొంతమంది బయట నిల్చని ఉండడం గమనార్హం. అయితే ఎన్నికలకు సిబ్బందికి శిక్షణ ఇలాగే ఇస్తారా అంటూ కొంతమంది అసహనం వ్యక్తం చేశారు. మండలంలో 18 నీటి సంఘాలు ఎన్నికలకు, 276 మంది సభ్యలకు ఎన్నికలు ఈనెల 21వ తేదీన జరుగటకు ప్రభుత్వము ప్రకటించింది. అయితే సాగినీటి సంగం యొక్క ఎన్నికల సిబ్బంది ఎలక్షన్ ఆఫీసర్, అసిస్టెంట్ ఎలక్షన్ ఆఫీసర్, పి ఓ మరియు ఏ పీ ఓ లకు శిక్షణ శుక్రవారం తాసిల్దార్ కార్యాలయంలో ఇరిగేషన్ ఏఈ హరి నిర్వహించారు. అయితే ఈ శిక్షణకు సిబ్బందికి సరిపడా స్థలం లేదు. కొంతమంది రోడ్డుపైన, శిక్షణ నిర్వాహకులు ఏమి చెవుతున్నది వారికి తెలియదు. సరేలే సర్దుకుపోదాం, ఇలాంటి ఎన్నికలు గతంలో కూడా చేసాం, అని లేదా ఆలకించిన వారికి వివరాలు అడిగి తెలుసుకుందాం అని అనడం గమనార్హం. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ జి హేమంత్ కుమార్, ఎంపీడీవో ఆర్ రాంబాబు, హెచ్ డి టి జి సత్యనారాయణ, ఎంఈఓ జె త్రినాధరావు, ఇరిగేషన్ ఏఈ హరి పాల్గొన్నారు.

తమ డిమాండ్ పరిశీలించాలంటూ 104 ఉద్యోగులు వినతి

విశాలాంధ్ర-చీపురుపల్లి : తమ డిమాండ్లు పరిష్కరించాలని చీపురుపల్లి మండల 104 సిబ్బంది చీపురుపల్లి మండల తహసిల్దార్ ఎంపీడీవో లకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ తమకి 3 నెలలు గా వేతనాలు ఇవ్వలేదు అని కుటుంబాలను పోషించటం చాక కష్టం అవుతుంది అని వాపోయారు. 104 సేవలను ప్రభుత్వమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా కేవలము 50 వేలు రూపాయల ఖర్చు తో నిర్వహించి ప్రజా దనము వృథాకాకుండా చూడాలి అని 2020 తరువాత విధుల్లో చేరిన డ్రైవర్ మరియు డి.ఈ.ఓ కు జి.ఓ 7 ద్వారా వేతనాలు ఇవ్వాలని అరబిందో యాజమాన్యం అక్రమంగా వసూలు చేసిన పి. యఫ్ తిరిగి చెల్లించాలి అని 74 మంది సీనియర్ డ్రైవర్లకు స్లాబ్ అమలు చెయ్యాలి అని డి. యస్సి ద్వారా నియమితులు అయిన సీనియర్ డ్రైవర్ లను కాంట్రాక్టు లో పెట్టాలి అని ఉద్యోగులకు ఇన్సూరెన్స్ చేయించాలి అని ఉద్యోగులకు యాజమాన్యం నుండి రావలసిన ఇతర బకాయిలు చెల్లించే విదంగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకొని ఉద్యోగులకు న్యాయం చెయ్యాలి అని తెలిపారు. ఈ కార్యక్రమం లో 104 ఉద్యోగులు డ్రైవర్స్ కే సంతోష్ కుమార్ ఎస్కే గలీబ్ .. డి ఈ ఓ లు హేమలత, అలేఖ్య, పాల్గొన్నారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి వాలీ బాల్ క్రీడా పోటీలు

విశాలాంధ్ర-భోగాపురం : జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి వాలీ బాల్ పోటీలు నిర్వహించేందుకు సర్వం సిద్ధమైంది. రాష్ట్రస్థాయి 68వ అండర్ 14 వాలీబాల్ క్రీడా పోటీలను నేటి నుంచి మూడు రోజులపాటు భోగాపురం ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి కే కృష్ణంరాజు తెలిపారు. ఇందు కోసం ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరులు సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాలురు మరియు బాలికల జట్లు కు ఇక్కడే ఈ పోటీలు నిర్వహిస్తామని, ఉమ్మడి 13 జిల్లాల నుంచి 26 జట్లు పాల్గొంటారని అన్నారు. ఇక్కడ ప్రతిభ చూపిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి జట్టును ఎంపిక చేస్తామని అన్నారు. వారణాసి లో జరిగే అండర్ 14 జాతి స్థాయి పోటీల్లో ఆంధ్ర తరఫున ఎంపిక చేసిన ఈ జట్టు పాల్గొంటుందని అన్నారు. జిల్లా కలెక్టర్ అంబేద్కర్ చేతుల మీదుగా శనివారం ఈ క్రీడలను ప్రారంభిస్తామని తెలిపారు. అలాగే రాష్ట్ర పాఠశాల విద్య ఇన్స్పెక్టర్ భానుమూర్తి రాజు హాజరవుతారని అన్నారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ కే వి ఏ ఎన్ రాజు మాట్లాడుతూ ఏర్పాట్లను పూర్తిస్థాయిలో చేయడం జరిగిందని అన్నారు. విద్యార్థులకు వసతి, భోజన సదుపాయాలు కూడా కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి టీవీ భగవాన్ దాసు, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ సభ్యులు సన్యాసినాయుడు, పరిశీలకులు చందన వర్మ, భోగాపురం, బొప్పడం పాఠశాలల ప్రధానోపా ధ్యాయులు మహేష్ కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో నలుగురు యువకులు అరెస్టు



విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : పట్టణంలో గంజాయి కలిగి, చిన్న మొత్తాల్లో విక్రయిస్తున్న నలుగురు యువకులను వన్ టౌన్ పోలీసులు అరెస్టు చేసి, రిమాండుకు తరలించినట్లుగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన యువకులు ఒక ప్రాంతంలో చదువుకుంటూ, స్నేహితులుగా ఉంటూ చెడు వ్యసనాలకు అలవాటుపడి, వారి అవసరాలకు ఒడిస్సా నుండి గంజాయిని తీసుకొని వచ్చి, చిన్న చిన్న ప్యాకెట్లుగా చేసి, విక్రయిస్తున్నట్లుగా వన్ టౌన్ పోలీసులకు వచ్చిన ఖచ్చితమైన సమాచారంతో రైడ్ చేసి ఆరుగురు యువకులను అరెస్టు చేసి, వారి వద్ద నుండి రెండు కిలోల గంజాయిని వన్ టౌన్ పీఎస్ ఇంచార్జ్ సిఐ ఎల్.అప్పల నాయుడు సీజ్ చేశారన్నారు. నిందితులు (1) చింతలవలసకు చెందిన కోరుకొండ కార్తీక్ (2) గంట్యాడ మండలం కొత్త వెలగాడ గ్రామానికి చెందిన పాపల కిరీటి (3) రొంగల ఆనంద్ (4) జి ఎల్ పురం మండలానికి చెందిన పురుషోత్తం జగదీశ్ (5) విజయనగరం పట్టణం గాజులరేగ కు చెందిన బెహరా దీపక్ పట్నాయక్ (6) కామాక్షి నగర్ కు చెందిన పెనుమజ్జి లోకేష్ కుమార్ ఉన్నారన్నారు. నిందితులు చెడు అలవాట్లకు లోనై గంజాయి సేవిస్తూ, తోటి స్నేహితులకు విక్రయిస్తూ పట్టుబడ్డారని తెలియజేశారు.

రాష్ట్రం లో లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తుంది....

వైసీపీ నాయకుల ఆందోళన...

విశాలాంధ్ర-చీపురుపల్లి: రాష్ట్రంలో నారా లోకేష్ రెడ్బుక్ రాజ్యాంగం నడుస్తుందని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చీపురుపల్లి నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం చీపురుపల్లి పట్టణం వైస్సార్ పార్టీ ఆఫీస్ లో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశం లో ఎంపీపీ ప్రతినిధి మండల వైస్సార్ పార్టీ అధ్యక్షులు ఇప్పిలి అనంతం ,జడ్పీటీసీ ప్రతినిధి, జిల్లా వైస్సార్ పార్టీ కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, టౌన్ ప్రెసిడెంట్ పతివాడ రాజారావు మాట్లాడారు. సీనియర్ నాయకులు చీపురుపల్లి ఎమ్మెల్యే(తెలుగుదేశం పార్టీ) కిమిడి కళావెంకటరావు గారు మా నాయకుడు వైస్సార్ పార్టీ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి వై యస్. జగన్మోహన్ రెడ్డి ని విమర్శలు చెయ్యడం విడ్డురంగా ఉంది అని వారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 6 నెలల కాలం అవుతుంది అని ఈ దేశం లో ఎక్కడ లేని విదంగా ఈ రాష్ట్రంలో ప్రజల మీద ప్రతిపక్ష నాయకుల మీద దాడులు హత్య కాండ కొనసాగుతున్నాయి అని అన్నారు. ఆడవారు, పసిపిల్లలు బయటకు రావాలంటే భయపడే పరిస్థితి ఈ రాష్ట్రంలో ఉంది అని 5 నెలల్లో అత్యధిక 91 హత్యాచారాలు మహిళలు, చిన్నపిల్లలు మీద ఎక్కవగా ఈ రాష్ట్రంలో జరిగాయి అని ఇది ప్రభుత్వం పాలనకు చేతకాని తనానికి నిదర్శనం అని అన్నారు. ఈ రాష్ట్రము లో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తుంది అని అందుకే పోలీసులు కూడా ఏమి చెయ్యలేని నిశ్చహాయ స్థితి లో ఉన్నారు అని అన్నారు.మాజీ ముఖ్య మంత్రి వై యస్. జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో ప్రజలకు ఎంతో మంచి చేసారు అని ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీ పక్కాగా అమలు చేసి ప్రజలకి అందించారు అని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 6నెలల కాలం అయినప్పటికి సూపర్ 6 హామీలు అమ్మవోడి పథకం రాలేదు అన్నారు.రైతు భరోసా లేదు, ఫ్రీ బస్సు లేదు, 20 లక్షల ఉద్యోగాలు ఏమి అయ్యాయో చెప్పాలనివారు డిమాండ్ చేశారు. చీపురుపల్లి నియోజకవర్గం లో చూసుకుంటే పరిపాలన అంత %మీారా ూరా% చేస్తున్నాదు అని అధికారులకు ఆదేశాలు కూడా అతనే ఇస్తున్నాడు అని వారన్నారు. 6 నెలల పరిపాలనలో మీరు నియోజకవర్గం లో కొంత మంది డీలర్ లని తీసివేయ్యడం, కొంతమంది వెలుగు యానిమిటర్లని తొలగించడం 50 మంది వరకు వాటర్ వర్క్స్ లో పనిచేస్తున్న పంపు ఆపరేటర్స్ లను తొలగించడం తప్ప ఈ నియోజకవర్గం లో మీరు చేసింది సూన్యం, అని అన్నారు. జనం ఇటువంటి %మీారా% ని ఎందుకు గెలిపించామా అని బాధపడుతున్న పరిస్థితి లో వున్నారు అని అన్నారు. వర్షాలు పడి కొంత వరకు రైతులకు పంటలు పండాయి తప్ప, తోటపల్లి నీరు కాలవలకి వొదలకపోవడం విచారకరమన్నారు. అలాగే వైసిపి పాలనలోనే చీపురుపల్లి %జుంజ% గవర్నమెంట్ హాస్పిటల్ ని 100 పడకలుగా అప్ గ్రేడ్ చేసి %+ూ% తెస్తే కనీసం అదికూడా మీరు చొరవ తీసుకొని చెయ్యలేకపోవడం మీ చేతకాని తనానికి నిదర్శన%శీ% కాదా అని ఏద్దేవా చేసారు. కింది స్థాయి నాయకులు మాటలు విని డీలర్ లను, వెలుగు వివో లు, పంపు ఆపరేటర్ లాంటి చిరుద్యోగుల ను తొలగించి వారి పొట్ట కొట్టడం మానుకొని నియోజకవర్గం అభివృద్ధి మీద దృష్టి పెట్టాలని తెలియజేస్తున్నా%శీ% అని అన్నారు. ఈ కార్యక్రమం లో వైస్సార్ పార్టీ నాయకులు ఎంపీపీ ప్రతినిధి ఇప్పిలి అనంతం,జడ్పీటీసీ ప్రతినిధి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు,టౌన్ ప్రెసిడెంట్ పతివాడరాజారావు, వైస్సార్ పార్టీ నాయకులు కోరుకొండ దాలయ్య, గవిడి సురేష్,రేవల్ల సత్తిబాబు,చింతాడ లక్ష్మణ,భవిరి రవిశంకర్,మీసాల కృష్ణ, ప్రభాత్, మురళి, నాగచైతన్య పాల్గొన్నారు.

నిబంధనలకు వ్యతిరేకంగా నిర్మాణాలు చేపడితే ఉపేక్షించేది లేదు

విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య

విశాలాంధ్ర-విజయనగరం అర్బన్ : అనుమతులు లేకుండా, నిబంధనలకు వ్యతిరేకంగా నిర్మాణాలు చేపడితే ఉపేక్షించేది లేదని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పి. నల్లనయ్య స్పష్టం చేశారు. శుక్రవారం డివిజన్ పర్యటనలో భాగంగా పూల్ బాగ్, ఎన్టీఆర్ జంక్షన్, వాటర్ ట్యాంక్, ఆటో జంక్షన్ తదితర ప్రాంతాల్లో పర్యటించి స్థానిక సమస్యలను తెలుసుకోవడంతో పాటు అక్రమ నిర్మాణాలు, అనుమతులు లేని కట్టడాలను గుర్తించి వాటిని తక్షణమే షోకాజ్ నోటీసులు ఇవ్వాలని సిబ్బందికి ఆదేశించారు. కాలువలు,రహదారులను ఆక్రమించి కట్టిన నిర్మాణాలను తొలగించివేయాలని సూచించారు. ఆస్తిపన్ను విధించలేని భవనాలకు వెంటనే పన్నులు విధించాలని రెవెన్యూ సిబ్బందికి ఆదేశించారు. పోస్టర్లు, ఫ్లెక్సీలు విచక్షణ రహితంగా అంటిస్తున్నారని ఇకమీదట అటువంటి వాటిని అనుమతించవద్దని చెప్పారు. పార్కును ఆక్రమించి ఓ ప్రాథమిక పాఠశాల నిర్వహించడం చోద్యంగా ఉందని అన్నారు. వివిధ టిఫిన్ దుకాణాల వద్దకు వెళ్లి సింగిల్ యూస్ ప్లాస్టిక్ వినియోగిస్తున్నారా లేదా అని గమనించారు. కొంతమంది ప్లాస్టిక్ కవర్లు వినియోగించడంతో వారిపై అపరాధ రుసుము విధించి ప్లాస్టిక్ వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.స్థానికంగా ఉన్న సమస్యలను తమ దృష్టికి తెచ్చినట్లయితే వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామన్నారు. పర్యటన అనంతరం కమిషనర్ పి నల్లనయ్య మాట్లాడుతూ అనుమతులు లేని కట్టడాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. భవన నిర్మాణాలకు తప్పనిసరిగా అనుమతులు ఉండాలని అన్నారు. ప్రతిరోజు సచివాలయ సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటన చేయాలని చెప్పారు. తద్వారానే స్థానిక సమస్యలు అవగతం అవుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమలరావు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు, టి పి ఎస్ అనిత, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

బహిరంగ మలవిసర్జన రహిత జిల్లాగా మారుద్దాం

వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ అంబేద్కర్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : బహిరంగ మల విసర్జన రహిత జిల్లాగా మార్చేందుకు సిద్ధం కావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పిలుపునిచ్చారు. దీనికోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించి దశలవారీగా అమలు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. గ్రామాల్లో క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితిని తెలుసుకొనేందుకు శనివారం నుంచీ ఇంటింటి సర్వే ప్రారంభించి, బుధవారం నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. తాసిల్దార్లు, ఎంపిడిఓలు, ఇతర మండల స్థాయి అధికారులతో కలెక్టర్ తమ ఛాంబర్ నుంచి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బుధవారం నుంచి ప్రతీఇంటికీ వెళ్లి సర్వే నిర్వహించాలని ఆదేశించారు. దీనికోసం గ్రామస్థాయి కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని, ఈ కమిటీలో పంచాయితీ కార్యదర్శి, ఆశా వర్కర్ లేదా ఏఎన్ఎం, వెల్ఫేర్ అసిస్టెంట్, గ్రామైక్య సంఘ అధ్యక్ష, కార్యదర్శులు సభ్యులుగా ఉంటారని తెలిపారు. ఈ కమిటీ తమ గ్రామంలో బహిరంగ మలవిసర్జన పరిస్థితులు, ఎన్ని ఇళ్లకు వ్యక్తిగత మరుగుదొడ్లు ఉన్నాయి, వాటిని ఎంతమంది వాడుతున్నారు, కొత్తగా ఎంతమందికి మరుగుదొడ్లు మంజూరు చేయాల్సి ఉంటుంది, ఎన్ని ఇళ్లకు సెప్టిక్ ట్యాంకు లేదా సోక్ పిట్స్ ఉన్నాయి, లేదా మరుగుదొడ్డి నుంచి కాలువల్లోకి నేరుగా పైపులు విడిచి పెట్టారా, త్రాగునీటి పైప్‌లైన్ల పరిస్థితిపై నివేదికలను అందజేయాలని ఆదేశించారు. ఈ నివేదికలను మండల స్థాయి కమిటీలు తనిఖీ చేసి తమకు అందజేయాలని సూచించారు. మండల స్థాయి కమిటీల్లో ఎంపిడిఓ, ఈఓపిఆర్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ, మెడికల్ ఆఫీసర్, మండల సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు సభ్యులుగా ఉంటారని తెలిపారు.బహిరంగ మల విసర్జన రహిత జిల్లాగా మార్చేందుకు ఈనెలాఖరునాటికి సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించి అమలు చేస్తామని కలెక్టర్ తెలిపారు. దీనికోసం జిల్లా అధికారులతో వివిధ కమిటీలను ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తామని చెప్పారు. బహిరంగ మలవిసర్జన పూర్తిగా నిర్మూలిం చాలన్న లక్ష్యంతో ప్రజలకు అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తామని, దీనిలో భాగంగా విద్యార్థులను, వారి ద్వారా తల్లితండ్రులను చైతన్యపరిచేందుకు రేపటినుంచి ప్రతీరోజూ పాఠశాలల్లో ప్రతిజ్ఞ చేయించాలని డిఈఓను ఆదేశించారు. ఇదొక ఉద్యమంలా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. సోమవారం నుంచి బుధవారం వరకు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, దీనికోసం అన్ని మండలాల్లో తగిన ముందు జాగ్రత్తలను తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్‌డిఏ పిడి ఎ.కల్యాణచక్రవర్తి, సిపిఓ పి.బాలాజీ, జెడ్‌పి సిఈఓ బివి సత్యనారాయణ, డిపిఓ టి.వెంకటేశ్వర్రావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఈ బి.ఉమాశంకర్, పిఆర్ ఎస్‌ఈ శ్రీనివాసరావు, డిఈఓ మాణిక్యం నాయుడు తదితర అధికారులు పాల్గొన్నారు.

మండల పరిషత్ కార్యాలయంలో విచారణ జరిపిన జడ్పీ సీఈవో

విశాలాంధ్ర-భోగాపురం : భోగాపురం ఎంపీడీవో ఎన్నికల కోడ్ ఉల్లంఘించారనే వ్యవహారంలో జిల్లా పరిషత్ సీఈవో సత్యనారాయణ శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో విచారణ జరిపారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పటికీ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారని ఎంపీడీవో కిరణ్ కుమార్ కు జిల్లా జాయింట్ కలెక్టర్ సేతు మాధవ్ షోకాజ్ నోటీస్ జారీ చేసిన విషయం తెలిసిందే. దీనికి ఎంపీడీవో కిరణ్ కుమార్ వివరణ కూడా ఇచ్చారు. అయినప్పటికీ తాజాగా జిల్లా పరిషత్ సీఈఓ ను విచారణ చేయాలని ఆదేశించారు. ఈ మేరకు ఆయన కార్యాలయానికి వచ్చి ఎంపీడీవో తో పాటు తహసీల్దార్ సురేష్, ఏ ఓ కామేశ్వరరావు ల నుంచి సమావేశం నాడు ఏం జరిగిందో వారి నుంచి స్టేట్మెంట్ రికార్డు చేశారు. జిల్లా పరిషత్ ఏ ఓ ఏ త్రినాధరావు పాల్గొన్నారు.

పీ.డీ.ఎస్ బియ్యం అక్రమ రవాణాపై విజిలెన్స్ దాడి

విశాలాంధ్ర -వేపాడ/కొత్తవలస: పౌర సరఫరాల బియ్యం అక్రమంగా తరలిస్తున్నట్టు వచ్చిన సమాచారం మేరకు అక్రమంగా రవాణా చేస్తున్న లారీపై దాడి చేసి పట్టుకున్నట్లు విజిలెన్స్ ఎస్పీ బర్ల ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు వారికి వచ్చిన సమాచారంపై కొత్తవలస జంక్షణలో తనిఖీలు చేపట్టగా ఏ.పీ.27టీ.టి3267 నెంబర్ గల లారీలో ప్రభుత్వం పేదలకు అందిస్తున్న పౌర సరఫరాల బియ్యం ఉన్నట్లు గుర్తించారన్నారు.ఈ పి.డి.ఎస్ బియ్యం వేపాడ మండలంలోని రామస్వామి పేట గ్రామంలో వున్న శ్రీ లక్ష్మీ శ్రీనివాస ఇండస్ట్రీ నుండి తరలిస్తున్నట్లు తెలిపారు.లారీలో సుమారు 447 బ్యాగ్ లలో 22 టన్నులు రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు.వాటి విలువ సుమారు రూ.10 లక్షల18 వేల 280 రూపాయలు ఉంటాయన్నారు.ఈ మేరకు పట్టుపడిన రేషన్ బియ్యంను లారీ ను సీజ్ చేసి లారీ డ్రైవర్ బొడ్డు కొండలరావు పిడిఎఫ్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న వి.రామారావులపై 6(%ూ%)7(1) ప్రకారం కేసు నమోదు చేసి చర్యలు తీసుకొంటామని తెలియజేశారు.ఈ దాడిలో విజిలెన్స్ సిఐ డి.వి.వి.సతీష్ కుమార్, కొత్తవలస పౌర సరఫరాల డిప్యూటీ తహసిల్దార్ రామకృష్ణ,విజిలెన్స్ సిబ్బంది పి.లక్ష్మి,నారాయణ ఎస్ రమేష్, వీఆర్ఓ రామానుజం తదితరులు పాల్గొన్నారు.

ఎస్సై పై ఫిర్యాదు చేసిన సచివాలయ సిబ్బంది

విశాలాంధ్ర-తెర్లాం: ఇటీవల బ్యాంకు వద్ద సచివాలయం సిబ్బంది పెన్షన్ విత్ డ్రా చేయుటకు వెళ్ళినప్పుడు అక్కడకు వచ్చిన స్థానిక ఎస్సై పలు సూచనలు చేస్తూ క్రిమినల్స్ తో మాట్లాడినట్లు మాట్లాడుతూ, అసభ్యమైన పదజాలం ప్రయోగిస్తూ, మా సిబ్బంది పట్ల చిన్నచూపు చూచి అసలు మీరు సచివాలయం ఉద్యోగులేనా అని మీకు ఊరికే ఉద్యోగాలు వచ్చాయని, మా మనోభావాలు దెబ్బతిన్నట్లు హేయమైన మాటలు మాట్లాడారని పంచాయతీ కార్యదర్శి సంఘం, మరియు జి ఎస్ డబ్ల్యు సంఘం నాయకులు శుక్రవారం తాసిల్దార్ జి హేమంత్ కుమార్ కు, ఎంపీడీవో రేగు. రాంబాబుకు ఫిర్యాదు చేశారు. ఎస్సై సాగర్ బాబు వివరణ:- డీఎస్పీ ఆదేశాల ప్రకారం పెన్షన్ డబ్బులు విత్డ్రా నిమిత్తం పంచాయతీ కార్యదర్శులు మీ దగ్గరలో ఉన్న ఎస్బిఐ బ్యాంకు కు వచ్చి పెన్షన్ డబ్బులు విత్ డ్రా చేసుకొని తీసుకొని వెళ్తారని వారికి ప్రాపర్ గా గైడ్ చేసి పంపించమనగా ఎస్బిఐ బ్యాంకు వద్దకు పోలీసు వారు వెళ్లి చూడగా ఒక పంచాయతీ కార్యదర్శి కూడా హాజరు కాకపోగా ఎస్బిఐ మేనేజర్ గారు చాలాసార్లు చెప్పినప్పటికీ నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్నారని ఎస్సై జాగ్రత్తలు చెప్పి పంపించారని, ఒక్కో కార్యదర్శి 25 లక్షల రూపాయలు డ్రా చేసి తీసుకెళ్లేటప్పుడు వారికి పలు సూచనలు చేయడం జరిగిందని అంతేకానీ వాళ్లని ఏ రకమైనటువంటి మాటలు అనలేదని ఆయన వివరణ ఇచ్చారు.

180 మంది రోగులకు వైద్య సేవలు.

వైద్యాధికారిణి ఏ ధరణి

విశాలాంధ్ర-వేపాడ : మండలంలోని వావిలపాడు గ్రామంలో 104 వాహనం ద్వారా 180 మంది రోగులకు వైద్య సేవలు అందించడం జరిగిందని వేపాడ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి ఏ.ధరణి తెలిపారు.ప్రజల వద్దకే ఆరోగ్య సేవలు అందించాలని ఉద్దేశంతో 104 వాహనం ద్వారా గ్రామంలో రోగులు దగ్గరకు వెళ్లి వైద్య సేవలు అందించడం జరుగుతుందని ఈ మేరకు రోగులకు పరీక్షలు చేసి మందులు అందించడం జరుగుతుందన్నారు.అలాగే బిపి షుగర్ జలుబు దగ్గు ఉన్నట్లు గుర్తించి ఉచితంగా మందులు పంపిణీ చేశామని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆరోగ్య వైద్య సిబ్బంది హెల్త్ అసిస్టెంట్ ఏఎన్ఎం ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ ఆధ్వర్యంలో మన గుడి కార్తీకమాసోత్సవాలు

విశాలాంధ్ర -విజయనగరం టౌన్ : తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలలో మన గుడి- కార్తీక మాసోత్సవాలం నిర్వహిస్తు న్నట్లు టిటిడి ప్రోగ్రాం అధికారి జె శ్యాంసుందర్ తెలిపారు. శుక్రవారం దీనికి సంబంధించిన ఫ్లెక్స్ బోర్డును టీటీడీ కళ్యాణ మండపం ఆవరణలో విడుదల చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన గుడి- కార్తీక మాసత్సవాల కార్యక్రమాలను జిల్లాలో గంట్యాడ మండలం రామభద్రపురం లో ఉన్న శివాలయంలో ఈనెల 11 నుండి 17 వరకు భజనలు ఉపన్యాసములు కార్తీక మాస దీపోత్సవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నా మన్నారు. అదేవిధంగా పార్వతీపురం మన్యం జిల్లాలో గరుగుబిల్లి మండలం ఉల్లి భద్ర లో ఉన్న శివాలయంలో భజనలు, కార్తీక మాస దీపోత్సవాలతో పాటు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాలకు భక్తులంతా పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సూర్యదేవ్ ,జి అప్పారావు తదితరులు పాల్గొన్నారు

9,10,11 జరుగు ఎన్నికల స్పెషల్ సమ్మర్ రివిజన్ ఓటరు నమోదు దినోత్సవం పై ప్రత్యేక దృష్టి సారించండి

డివిజనల్ అధికారి రామ్మోహన్రావు

విశాలాంధ్ర-బొబ్బిలి : భారత ఎన్నికల సంఘం మరియు జిల్లా కలెక్టర్ అంబేద్కర్ వారి ఆదేశముల మేరకు, (స్పెషల్ సమ్మరీ రివిజన్)-2025 లో భాగంగా ప్రతి పోలింగ్ కేంద్రంలో ప్రత్యేక ఓటర్ల నమోదు దినోత్సవం ను సంబంధిత బూత్ లెవెల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని రెవిన్యూ డివిజనల్ అధికారి వి ఎస్ ఎస్ రామ్మోహన్ వు సంబంధిత బి ఎల్ వల్ల ఆదేశించారు.ఈ నెల 9,10,11 వరకు సంబంధిత బూత్ స్థాయి అధికారులు ఉదయం 10.00 గంటల నుండి సాయంత్రం గం,,05.00 లు వరకూ సంబంధిత పోలింగ్ కేంద్రంల వద్ద డ్రాఫ్ట్ ఓటర్ లిస్టులు పట్టుకొని , గ్రామ అందరు ఓటర్ల సమక్షంలో ఓటర్ లిస్టు అంతయు బహిరంగంగా చదివి వినిపించి, అర్హులైన కొత్తగా ఓటర్లుగా నుండి ఓటరు గా నమోదు చేయట, మరణించిన ఓటర్లను ఓటర్ జాబితా నుండి తొలగించుట మరియు జాబితాలో ఏవైనా తప్పులు ఉన్నచో, సదరు తప్పులను సవరించుట మొదట కార్యక్రమంలు బూత్ లెవెల్ అధికారులు సరిచేయాలని కోరారు. నియోజకవర్గంలో ఉన్న అందరు బూత్ స్థాయి అధికారులు కేటాయించిన పోలింగ్ కేంద్రంలో వద్ద పైన ఉదాహరించిన విధంగా వేచి ఉండవలెను. అదేవిధంగా బూతులు అధికారులు సూపర్వైజర్లందరూ రేపు మరియు ఎల్లుండి మీకు కేటాయించబడిన పోలింగ్ కేంద్రాలను విధిగా సందర్శించి అందరు బి ఎల్ వో లు హాజరు అయ్యేలా చూసి ఎక్కడా ఏ ఒక్క బి ఎల్ వో లు కూడా గైర్హాజరు లేనట్టు చూసి, ప్రతి పోలింగ్ కేంద్రం నుండి ఎన్ని ఫారం-6, 7, 8 లు వచ్చినవి సేకరించి బొబ్బిలి ఎలక్షన్స్ విభాగం వారికి పోలింగ్ కేంద్రం వారిగా స్త్రీ పురుషులు సాయంత్రం గం,, 05.00 లలోగా వివరములు తెలియజేయాలని రెవెన్యూ డివిజనల్ అధికారి తెలిపారు.

20 లోపల కొత్త సహకార సంఘాలు ఏర్పాటు కు చర్యలు

సంయుక్త కలెక్టర్ సేతు మాధవన్

విశాలాంధ్ర - విజయనగరం: మత్స్య, పశు సంవర్ధక, సహకార శాఖలలో నవంబర్ 20 లోపల కొత్త సహకార సంఘాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని జేసీ సేతు మాధవన్ తెలిపారు. శుక్రవారం తన ఛాంబర్ లో ఆయా అధికారులతో సమావేశం నిర్వహించారు. సంఘాల ఏర్పాటుకు ఎటువంటి సంఘాలు లేని గ్రామాలను గుర్తించాలని తెలిపారు. జిల్లాలో 100 సంఘాల ఏర్పాటు చేయాలని లక్ష్యంగా చేశామని, సొసైటీ లు ఏర్పాటు చేసిన తర్వాత కమిటీ సభ్యులు వేయడం జరుగుతుందని అన్నారు. మార్చి 31 లోగా ప్రక్రియ పూర్తి చేసి నాబార్డ్ సహకారం తో శిక్షణలు, నిధులు తదితర ఏర్పాట్లను చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో నాబార్డ్ డీడీఎం నాగార్జున, మత్స్య , పశు సంవర్ధక శాఖల జె డి లు నిర్మలా కుమారి, డా.వై.వి రమణ, డిసిసిబి సీఈ.ఓ ఉమా మహేశ్వర రావు, డి సి ఓ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ లో అభివృద్ధి పనులు పూర్తిచేసిన పనులకు బిల్లులు చెల్లించాలి ...

విశాలాంధ్ర-బొబ్బిలి : మున్సిపాలిటీ అభివృద్ధికి అప్పులు చేసి సీసీ రోడ్లు వేస్తే బిల్లులు చేసేందుకు మున్సిపల్ అధికారులు తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారని కాంట్రాక్టర్ చప్ప చంద్రశేఖర్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ కార్యాలయం వద్ద గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈఏడాది ఏప్రిల్ నెలలో స్వామివారివీధిలో రూ. 14లక్షలతో మూడు రోడ్లు, పోస్టాఫీసు సందులో రూ. 6లక్షలతో ఒక రోడ్డు, కోరాడవీధి స్మశానంలో రూ. 5లక్షలతో రోడ్డు, ఓంకార్ థియేటర్ వెనుక రూ. 5లక్షలతో రోడ్డు, మల్లమ్మపేటలో రూ. 1.45లక్షలతో రోడ్డు నిర్మాణం చేస్తే బిల్లు ప్రాసెస్ చేసేందుకు అధికారులు తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో పని చేసిన ఏఇ సురేష్ బిల్లులు ప్రాసెస్ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. బిల్లులు మంజూరు అయిన వెంటనే మున్సిపల్ అధికారులకు ఇవ్వాల్సిన పిపిలు ఇస్తున్న తమను ఇబ్బందులు పెట్టడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. అప్పులు చేసి పనులు చేస్తే సకాలంలో బిల్లులు చేయకపోవడంతో చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించలేకపోవడంతో అప్పులు ఊబిలో కూరుకుపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ కమిషనర్ స్పందించి బిల్లులు ప్రాసెస్ చేసి బిల్లులు మంజూరు అయ్యేలా చూడాలనికోరారు.